
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

# కాకినాడ

జిల్లా వార్తలు

శుక్రవారం 22 ఆగస్టు 2025 | 5



బొమ్మను చేసి.. ప్రాణము పోసి.. 6

- ఆ గ్రామం బొమ్మల పొదరిల్లు
- బొమ్మల తయారీకి పెట్టింది పేరు గాడిలంక
- సుమారు 150 ఏళ్ల చరిత్ర
- గణనాథుల విగ్రహాలతో కళకళ

# కేబినెట్ 'వరాలు'



పుష్కర ఎత్తిపోతల పథకం

- పుష్కర ఎత్తిపోతల పథకం పైపులైన్ల మార్పునకు ఆమోదముద్ర
- రూ.51.67 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు పచ్చజెండా
- 31వేల ఎకరాల ఆయకట్టుకు ఊపిరిలూదిన సీఎం చంద్రబాబు
- గ్రామ, వార్డు సచివాలయాల్లో పోస్టుల భర్తీకి ఆమోదంతో ఊరట
- చింతూరు ఆసుపత్రి 50 నుంచి వంద పడకలుగా మార్పునకు ఓకే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జగ్గంపేట నియోజకవర్గంలో కీలకమైన తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం తీపికబురు అందించింది. గత వైసీపీ హయాంలో పైపులైన్లు మరమ్మతుకు గురై మూలనపడ్డ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు ఊపిరి పోశారు. పాడైపోయిన కీలక పైపులైన్ల స్థానంలో కొత్తవి నిర్మించడానికి మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. రూ.51.67 కోట్లతో పనులు చేపట్టేందుకు వీలుగా పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు పచ్చజెండా ఊపింది. దీంతో 31వేల ఎకరాల ఆయకట్టుకు తిరిగి నీరు అందబోతోంది. గండేపల్లి మండలం తాళ్లూరు వద్ద నిర్మించిన ఈ పథకం ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు గురైంది. దీనికి శంకుస్థాపన నుంచి టెండర్లు పిలిచి పనుల ప్రారంభం వరకు అప్పట్లో టీడీపీ ప్రభుత్వంలోనే జరిగింది. తీరా వైఎస్ సీఎం అయిన తర్వాత ప్రాజెక్టు పనుల్లో మార్పులు చేశారు. సాగునీరు ప్రవహించడానికి ఇనుప పైపులు బదులు సిమెంట్ పైపులు వినియోగించారు. దీంతో కాలక్రమేణా సిమెంట్ పైపులపై ఒత్తిడి పెరిగి ఎందుకు పనికి రాకుండా పోయాయి. గత వైసీపీ హయాంలో వీటికి మరమ్మతులు చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. దీంతో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దాదాపు 14సార్లు సీఎం చంద్రబాబు దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. చంద్రబాబు మానసపుత్రికలాంటి ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేయాలని కోరారు. దీంతో ప్రయత్నాలు ఫలించి పీఎస్‌సీ ప్రెజర్ మెయిన్‌ను ఎంఎస్ ప్రెజర్ మెయిన్‌తో మార్చే పనికి టెండర్లను ఆహ్వానించి రూ.51.67 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది. దీనిపై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పందిస్తూ సీఎం చంద్రబాబు రుణం తీర్చుకోలేనిదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పైపులైన్ల మరమ్మతులకు నిధులు అడిగితే రూ.25 లక్షలు విదిల్చారని, కానీ ఇప్పుడు సీఎం చంద్రబాబు రూ.51.67కోట్లు విడుదలకు నిర్ణయించడం గొప్ప విషయమన్నారు. ఇక గ్రామ, వార్డు సచివాలయాల్లో డిప్యుటేషన్, అవుట్ సోర్సింగ్ విధానం కింద 2,778 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న 1,500 పోస్టుల్లో 700వరకు పోస్టులను భర్తీ చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. అలాగే చింతూరులో ఉన్న 50పడకల ఆసుపత్రిని వంద పడకలస్థాయికి పెంచుతూ ఆమోదించింది.



పిఠాపురంలోని వెలుగు కార్యాలయం

# సభ్యులను మార్చి.. ఫోర్జరీ చేసి..



రుణాలపై విచారణ నిర్వహిస్తున్న డీఆర్డీఏ అధికారులు (ఫైల్‌ఫొటో)

- 168 సంఘాల పేరుతో రూ.18.89కోట్లు రుణాలు స్వాహా
- సంఘాల్లో ఇతర మండలాలు, జిల్లాల నుంచి సభ్యులు
- తనతోపాటు బంధువులతో సంఘం ఏర్పాటు చేసిన వెలుగు సీసీ
- ఇది ఒక క్లస్టర్‌లో జరిగిన వ్యవహారం.. జిల్లాలో ఇలాంటివెన్నో
- సమగ్ర విచారణ జరిపిస్తే మరిన్ని వెలుగుచూసే అవకాశం
- బ్యాంకు అధికారుల పాత్రపై ఆరోపణలు
- కింద స్థాయి సిబ్బందిపైనే చర్యలు
- అధికారులకు క్లీన్‌చిట్

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పిఠాపురం మండలంలో స్వయం సహాయక సంఘాల్లో సభ్యుల ఫోర్జరీ పత్రాలతో 168 సంఘాలు ఏర్పాటుచేసి రూ.18.89 కోట్లు స్వాహా చేసిన సంఘటన ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇది కేవలం ఒక క్లస్టర్ పరిధిలోని రెండు గ్రామాల్లో జరిగిన వ్యవహారం. దీనిపై లోతుగా విచారణ చేయాల్సిన ఉన్నతాధికారులు దాన్ని ఆ గ్రామాలకే పరిమితం చేసి దిగువ సిబ్బందిపై చర్యలు తీసుకొని చేతులు దులుపుకున్నారు. ఇందులో పర్యవేక్షణ చేయాల్సిన మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారుల పాత్రను ఎక్కడా బయటకు రానివ్వకుండా, విచారణ పరిధి పెరగకుండా వారు వ్యవహరిస్తున్న తీరు ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది. స్వాహా చేసిన రుణాలను ఇప్పటివరకూ రికవరీ చేయకపోవడంతో అసలు రుణాలే తీసుకోని మహిళలు బాధితులుగా మిగిలారు. వీరికి బ్యాంకులనుంచి రుణాలు చెల్లించాలని నోటీసులు జారీ అవుతున్నాయి. వాస్తవానికి మహిళలతో సంఘం ఏర్పాటు చేయాలంటే వారంతా ఒకే గ్రామానికి చెందిన వారై ఉండాలి. సదరు మహిళలు ఇతర సంఘాల్లో సభ్యులుగా లేరని, ఏ బ్యాంకు రుణం పొందలేదని ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాతే సంఘం ఏర్పాటు చేసి బ్యాంకులో ఖాతాను ప్రారంభించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో వీవోఏ, సీసీ, ఏపీఎం, సంబంధిత బ్యాంకు సిబ్బంది కీలకపాత్ర పోషిస్తారు. పి.తిమ్మాపురం క్లస్టర్ పరిధిలోని పిఠాపురం మండలం బి.కొత్తూరు, ఎల్ఎన్‌పురం తదితర గ్రామాల్లో ఈ నిబంధనలు పాటించకుండా ఏకంగా 168 సంఘాలు ఏర్పాటుచేశారు. అప్పటి వీవోఏతో పాటు సీసీ, ఇతర సిబ్బంది, కొందరు ప్రైవేటు వ్యక్తులు కుమ్మక్కయి ఇప్పటికే సంఘాల్లో సభ్యులుగా ఉండి వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న 211మంది మహిళల పత్రాలను తీసుకుని ఫోర్జరీ పత్రాలు సృష్టించారు. వీరితోపాటు ఇతర మండలాలు, జిల్లాలకు చెందిన మహిళలతో కలిపి సంఘాలను ఏర్పాటుచేశారు. 2018 నుంచి 2023 వరకూ ఈ ప్రక్రియ యథేచ్ఛగా సాగింది. ఫోర్జరీ పత్రాలు, ఇతర సంఘాల్లో ఉన్నవారు, ఇతర జిల్లాలు, మండలాల వారిని సభ్యులుగా చేర్చి సంఘాలు ఏర్పాటు చేస్తున్నా అప్పటి సీసీలు, ఏపీఎంలు, డీపీఎంలు, జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

## అదే ఫోర్జరీ పత్రాలతో రుణాలు

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన సంఘాలకు బ్యాంకులనుంచి రుణాలు చకాచకా మంజూరయ్యాయి. పిఠాపురంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాశాఖ నుంచి 141 సంఘాలకు రూ.16.24 కోట్లు, డీసీసీబీ పిఠాపురం బ్రాంచి నుంచి 27 సంఘాలకు 2.65కోట్లు మంజూరు చేశారు. మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేసే సమయంలో ఆ సంఘంలోని సభ్యులందరి సంతకాలు తమ సమక్షంలో తీసుకుని వారి ఆధార్‌తో రుణచరిత్రను, వారు ఏయే ప్రాంతాలవారు, ఇతర బ్యాంకుల్లో రుణాలు ఉన్నాయా లేదా పరిశీలించాల్సిన బ్యాంకు అధికారులు అవేమీ లేకుండానే వెలుగు వీఓఏ (యానిమేటర్)లు సీసీ ద్వారా రుణ దరఖాస్తు రాగానే మంజూరు చేసేశారు. మొత్తం ఈ వ్యవహారమంతా వెలుగు సిబ్బంది, అధికారులు, బ్యాంకు సిబ్బందికే తెలిసి జరగడంతో ఐదేళ్లపాటు వెలుగుచూడలేదు. ఇందులో వైసీపీ వారి హస్తం ఉందనే ఆరోపణలున్నాయి. ఇక పి.తిమ్మాపురం క్లస్టర్ కమ్యూనిటీ కోఆర్డినేటర్(సీసీ)గా పనిచేసిన ఎంఆర్ మీనాక్షి తానే కనకుదర్గ ఎస్‌హెచ్‌జీల సభ్యురాలిగా చేరారు. అదే తన బంధువులను 15మందితో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి రుణాలు పొందడం గమనార్హం. 168 సంఘాల ఏర్పాటులో అప్పటి బి.కొత్తూరు వీఓఏ డి.పద్మకుమారి కీలకపాత్ర పోషించినట్టు అధికారుల విచారణలో వెల్లడైంది.

## నామమాత్రపు చర్యలతో సరి

రెండు గ్రామాల పరిధిలో జరిగిన ఈ వ్యవహారానికి సంబంధించి అప్పటి సీసీ ఎంఆర్ మీనాక్షిని విధులు నుంచి సస్పెండ్ చేయగా, వీఏవోను పద్మకుమారిని విధులు నుంచి తొలగించారు. ఈ వ్యవహారాన్ని నిరంతరం పర్యవేక్షించే ఏపీఎంలు, డివిజన్, జిల్లా స్థాయి అధికారులపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అదేవిధంగా పిఠాపురం మండలంలో 24 గ్రామాలకుగానూ రెండు గ్రామాలకే విచారణ పరిమితం చేసి మిగిలిన గ్రామాల్లో సంఘాలకు రుణాల జారీ తదితర వ్యవహారాలపై విచారణ జరపకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇదే రీతిలో కాకినాడ రూరల్ సహా పలు మండలాల్లో మహిళా సంఘాలకు మంజూరైన రుణాలు పక్కదారి పట్టాయి. వీటిపైనా విచారణ లేదు.

## మా రుణాలు ఎవరు కడతారు..

2018 నుంచి 2023 వరకూ ఫోర్జరీ పత్రాలతో రుణాల మంజూరు వ్యవహారం బ్యాంకు అధికారుల మార్పుతో వచ్చింది. పిఠాపురం బ్యాంకు ఆఫ్ బరోడా శాఖలో మహిళా సంఘాలు తీసుకున్న రుణాల్లో రూ.11కోట్ల వరకూ వసూలు కాకపోవడంతో వారు వెలుగు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అదే సమయంలో సంఘాల్లో ఉన్న మహిళలకు తక్షణం రుణాలు చెల్లించాలని, లేకుంటే ఆర్‌ఆర్‌యాక్టు ప్రయోగిస్తామని బ్యాంకులు నుంచి నోటీసులు జారీ అయ్యాయి. దీనితో తాము తీసుకోని రుణాలకు ఎలా చెల్లిస్తామంటూ మహిళలు అధికారులను నిలదీశారు. వారు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారమంతా వెలుగుచూసింది. బాధ్యులైన వారిపై డీఆర్డీఏపీడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విచారణను సీబీసీఐడీకి ఇస్తే ఎవరి పాత్ర ఉంది, బ్యాంకులు, సిబ్బంది పాత్ర వెలుగుచూస్తుందని చెబుతున్నారు.



అన్నవరంలో ఉచిత వరలక్ష్మి వ్రతాల నిర్వహణకు సిద్ధం చేసిన నిత్యకల్యాణ మండపం

# రత్నగిరిపై నేడు ఉచిత వరలక్ష్మి వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉచిత వరలక్ష్మి వ్రతాల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు తెలిపారు. 5వేలమందికిపైగా మహిళలు విచ్చేస్తారని అంచనా వేస్తుండగా వారికి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. ముందుగా నిత్యకల్యాణ మండపంలో మొదటి బ్యాచ్ వేసి రూ.300 వ్రతమండపాలు నాలుగు, ఐదు నెంబర్లు కేటాయిస్తామని, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించడంతోపాటు మహిళాసిబ్బంది, మహిళా సేవకులతో వరలక్ష్మి వ్రతాలకు హాజరయ్యే మహిళలకు సేవలందిస్తారన్నారు. మహిళలు కొబ్బరికాయ, అరటిపండ్లు, విడిపూలు తీసుకొస్తే మిగిలిన సామగ్రి దేవస్థానం అందజేస్తుందని, వరలక్ష్మి వ్రతాల్లో పాల్గొనేవారికి ప్రత్యేక దర్శనం, ఉచిత అన్నప్రసాదం అందజేస్తామని తెలిపారు.

# పాదగయలో వ్రతాల ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష



పాదగయ క్షేత్రంలో వరలక్ష్మి వ్రతాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్

పిఠాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో ఈ నెల 22న జరిగే సామూహిక వరలక్ష్మి వ్రతాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్ గురువారం రాత్రి పరిశీలించారు. వ్రతాలకు వచ్చే మహిళా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. వారి వెంట పిఠాపురం తహసీల్దార్ పీవీ గోపాలకృష్ణ, సీఐ శ్రీనివాస్, పాదగయ ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పాదగయలో వరలక్ష్మి వ్రతాల టిక్కెట్ల జారీ గందరగోళంగా మారడం, తోపులాటకు మహిళలకు గాయాలైన నేపథ్యంలో ఇంటెలిజెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. ఎస్పీ విజయభాస్కర్, రాజమహేంద్రవరం డీఎస్పీ గౌస్‌బేగ్‌లు పాదగయ క్షేత్రానికి వచ్చి ఏర్పాట్లు పరిశీలించారు. బారికేడింగ్, క్యూలైన్లను మరింత పటిష్ఠం చేయాలని సూచించారు. బందోబస్తు పెంచాలని, వ్రతాల జరిగే ప్రాంతానికి మహిళలు వచ్చే సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# గోదావరి ఉగ్రరూపం

- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- రెండో ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతున్న నీటిమట్టం

7

రాజమహేంద్రవరంలోని రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద వరద ఉధృతి



# క్యాన్సర్ నియంత్రణపై వైద్యాధికారులకు శిక్షణ

- త్వరలో జిల్లావ్యాప్తంగా ఎన్‌సీడీసీడీ 4.0 పేరుతో ప్రత్యేక సర్వే: డీఎంహెచ్‌వో





కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాయక్

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్‌సీడీ 4.0 క్యాన్సర్ వ్యాధినివారణపై వైద్యాధికారులకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం శిక్షణఇచ్చారు. ఈ కార్యక్రమం డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీ సీడీ 3.0 పేరుతో చేపట్టిన సర్వేలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులతోపాటు అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించగా చాలామందికి లక్షణాలున్నా పరీక్షలకు ముందుకు రావడం లేదన్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రమాణాలకు అనుగుణంగా సమాచారం వెల్లడి కావడం లేదన్నారు. బాధితులను పక్కాగా గుర్తించేందుకు ప్రభుత్వం ఎన్‌సీడీసీడీ 4.0 పేరుతో త్వరలో ప్రత్యేక సర్వే ప్రారంభించబోతోందన్నారు. ఈ నెల 21 నుంచి సెప్టెంబరు 27వరకు జిల్లాలోని వైద్యాధికారులకు, మహిళా ఆరోగ్యకార్యకర్తలకు, విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు పూర్తి చేశామన్నారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ బాధితులను గుర్తించేందుకు ఏటా ఆరోగ్య సర్వేలు చేపడుతున్నామన్నారు. శిక్షణ అనంతరం క్షేత్రస్థాయి సర్వేలో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అనుమానితులను జీజీహెచ్‌లోని అంకాలజీ ఓపీకి రిఫరల్ సర్వీస్ ద్వారా పంపి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ జేడీ నరసింగరావు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణ, డీఎల్‌ఓ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ రుక్మిణి పాల్గొన్నారు.

# సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- కలెక్టర్ షాన్‌మోహన్
- సామర్లకోట, పెద్దాపురంల్లో అధికారులతో కలిసి సీఎం సభా ఏర్పాట్ల పరిశీలన



సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దాపురం/సామర్లకోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న సీఎం చంద్రబాబు పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. జేసీ, ఇతర జిల్లా అధికారులతో కలిసి గురువారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించే ప్రాంతాలను సీఎం టూర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, రెవెన్యూ, పోలీస్ ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. హెలిప్యాడ్ నుంచి కొండయ్యపేటలోని పీ4 గృహాలను పరిశీలించనున్న నేపథ్యంలో అక్కడి ప్రదేశాలను పరిశీలించి అధికారులకు పలుసూచనలు చేశారు. త్వరితగతిన ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. తొలుత పెద్దాపురం నుంచి సామర్లకోట మీదుగా జి.రాగంపేట రోడ్డులోని హెలీపాడ్ నుంచి ఏఎస్ఎల్ నిర్వహించారు. హెలీపాడ్‌కు ఎదురుగాఉన్న లేఅవుట్ స్థలంలో పీ4 సదస్సు నిర్వహించేందుకు కేటాయించినట్లు తెలిపారు. ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం ఎదురుగా పూర్ణా కళ్యాణమండపంలో సదస్సుకు చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 23న సామర్లకోట, పెద్దాపురంల్లో ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆయన వెంట కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, మున్సిపల్ కమిషనర్‌లు శ్రీవిద్య, శ్రీకాంత్‌రెడ్డి, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనలో విధులు నిర్వహించే అధికారులు వీరే

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న కాకినాడ జిల్లా పెద్దాపురంలో సీఎం చంద్రబాబు పర్యటనలో ఏర్పాట్లు చేయడానికి, పర్యటన విజయవంతం చేయడానికి ప్రొటోకాల్ ప్రకారం అధికారులను నియమించారు. ఈమేరకు కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ఉత్తర్వులు విడుదల చేశారు.

జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా మొత్తం పర్యటనకు సూపర్‌వైజింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి సహకారం అందిస్తారు.

జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సీఎంకు ఉన్న జడ్‌ప్లస్ కేటగిరీ, ఎన్ఎస్‌జీ మొబైల్ బీపీ కారుకు, పీఎస్‌వోస్, ఆర్మ్‌డ్ ఎస్కార్ట్స్, పైలెట్ వాహనాలకు రూట్‌మ్యాప్ చూపిస్తారు. సీఎం పర్యటించే ప్రాంతాలు, సమావేశాల వద్ద గుర్తుతెలియని వ్యక్తులు సంచరించకుండా కట్టుదిట్టమైన భద్రతాచర్యలు తీసుకుంటారు.ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటారు.

జిల్లా ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారి, పెద్దాపురం ఈఈలు సీఎం ల్యాండ్ అయ్యే హెలీప్యాడ్ పర్యవేక్షిస్తారు. సభాస్థలంవద్ద వీవీఐపీల కుర్చీల ఏర్పాటుకు పర్యవేక్షిస్తారు. సీఎం పర్యటించే రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చడానికి చర్యలు తీసుకుంటున్నారు. సీఎం కాన్వాయ్‌తోపాటు పెద్దాపురంలో పూర్ణకల్యాణ మండపం వద్ద జిల్లా ముఖ్యఅగ్నిమాపక అధికారి ఆధ్వర్యంలో అగ్నిప్రమాద నివారణకు ఏర్పాట్లు చేస్తారు. ప్రజావేదిక, పూర్ణకల్యాణమండపం వద్ద సీఎం మాట్లాడడానికి వీలుగా మైక్రోఫోన్లు, కవరేజ్ నిమిత్తం మీడియాకు ఏర్పాట్లు ఐఅండ్‌పీఆర్ డీడీ నాగార్జున నిర్వహిస్తున్నారు.

డీఎంహెచ్‌వో, జీజీహెచ్ సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్ ఆధ్వర్యంలో మెడికల్ అంబులెన్సుతోపాటు మెడికల్ క్యాంపు నిర్వహిస్తారు. జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారుల ఆధ్వర్యంలో వీవీఐపీలకు అల్పాహారం ఏర్పాటు చేస్తారు. సీఎం కాన్వాయ్‌కు కావాల్సిన వాహనాలను

## ప్రొటోకాల్ ప్రకారం నియమించిన కలెక్టర్

డీటీసీ ఏర్పాటు చేస్తున్నారు. నోట్సును సీపీవో సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజావేదిక వద్ద గ్రీవెన్సును ప్రజలనుంచి స్వీకరించడానికి డీఎల్‌డీవో కాకినాడ, పెద్దాపురం అధికారులను నియమించారు. సీఎం పర్యటనలో పారిశుధ్యం కాకినాడ, సామర్లకోట మున్సిపాల్టీలకు అప్పగించారు. సీఎం కార్యక్రమాల్లో పాల్గొనే సీఎంవో సిబ్బంది, జిల్లా అధికారులు, మీడియా, బంగారు కుటుంబాలు, మార్గదర్శులకు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావుకు పాసులు జారీచేసే బాధ్యతలను అప్పగించారు. మధ్యాహ్నం నిర్వహించే భోజనానికి కాకినాడ తహసీల్దార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. సీఎంను స్వాగతించడం, హెలీకాప్టర్ వద్ద ప్రొటోకాల్ విధులను డ్వామా అధికారులకు అప్పగించారు. పర్యటన ప్రాంతాల్లో డ్రైన్ల నిర్వహణ పర్యవేక్షణ బాధ్యతలను డీపీవోకు ఇచ్చారు. ఇలా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు.

## టిక్కెట్ల జారీలో గందరగోళం

7

- నేడు పిఠాపురం పాదగయలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు

## ఆలయాలే టార్గెట్

7

- పాత నేరస్థుడి అరెస్టు
- కిలో బంగారం స్వాధీనం

## ఏసీబీకి చిక్కిన ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్

7

## తీరప్రాంతంలో పోర్టులకు రైల్వే లైన్లు అనుసంధానం

- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 21(ఆన్‌లైన్): ఏపీలో తీర ప్రాంతం వెంబడి ఉన్న ప్రధాన పోర్టులకు రైల్వేలైన్ల అనుసంధానాన్ని మరింత పెంచడానికి చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి తెలిపారని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ వెల్లడించారు. ఏపీలో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, పోర్టులకు రైల్వేలైన్ కనెక్టివిటీ పెంపుపై ఆయన కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను గురువారం ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో రైల్వేమంత్రి బదులిచ్చారన్నారు. ఇప్పటికే కోటిపల్లి-నరసాపురం మధ్య రూ.2120కోట్లతో కొత్త రైల్వేలైన్ నిర్మాణాలు చేపట్టగా పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఏపీ తీరప్రాంతంలో ఆరు కొత్త రైల్వే లైన్ల అనుసంధానానికి డీపీఆర్‌లను ఆమోదించామని చెప్పారు.



గణనాథుల విగ్రహాలకు తుది మెరుగులు అద్దుతున్న కళాకారులు

ఆ పల్లెటూళ్లో 1364 మంది జనాభా ఉండగా 440 కుటుంబాలు ఉన్నాయి. బొమ్మల తయారీ ద్వారా ఇక్కడ ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఎంతోమంది ఉపాధి పొందుతుంటారు. ఏ ఇల్లు చూసినా రకరకాల బొమ్మలతో దర్శనమిస్తాయి. ఏడాది పొడవునా విగ్రహాలు తయారు చేస్తారు. వినాయకచవితికి బొమ్మల తయారీకి ఒక ప్రత్యేకత ఉంది. మూడు, నాలుగు నెలల ముందే బొమ్మల తయారీలో కళాకారులు నిమగ్నమవుతారు. మట్టితో ఐదు అంగుళాల నుంచి 10 అడుగుల వరకు బొమ్మలు తయారు చేస్తారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ అయితే అడుగు నుంచి 15 అడుగుల వరకు తయారు చేస్తుంటారు. ఆ గ్రామమే గాడిలంక.



# బొమ్మను చేసి... ప్రాణము పోసి...

- ఆ గ్రామం బొమ్మల పొదరిల్లు
- బొమ్మల తయారీలో పెట్టింది పేరు గాడిలంక
- సుమారు 150 ఏళ్ల చరిత్ర
- గణనాథుల విగ్రహాలతో కళకళలాడుతున్న వైనం

ముమ్మిడివరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మట్టికి ప్రాణం పోసే దేవుళ్లు అక్కడ ఉన్నారు. అక్కడ శిల్ప కళాకారుల చేతిలో మట్టి అద్భుతమైన కళాఖండాలుగా రూపుదిద్దుకుంటుంది. పచ్చని పంట పొలాల మధ్య ఆ గ్రామం రంగు రంగుల బొమ్మలతో కళకళలాడుతుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గాడిలంక బొమ్మల తయారీకి పెట్టింది పేరు. ఇక్కడ బొమ్మల తయారీకి సుమారు 150 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో పెద్దిరెడ్డి వెంకన్న అనే శిల్పి గ్రామంలో తొలిసారి బొమ్మల తయారీని ప్రారంభించారు. ఆ తర్వాత అతని కుమారుడు అచ్యుతరామయ్య ద్వారా మిగతా వారు శిల్పకళ నేర్చుకున్నారు. గ్రామంలో 80 వరకు బొమ్మల పరిశ్రమలు ఉండేవి. ప్రస్తుతం బొమ్మల తయారీలో లాభసాటి కరువవడంతో 15 కంపెనీలకు పరిమితమయ్యాయి. గ్రామంలో వందలాది మంది కళాకారులు వినాయకచవితి సీజన్‌లో వేలాది బొమ్మలు తయారుచేస్తుంటారు. ఇక్కడి నుంచి దేశ, విదేశాలకు కూడా విగ్రహాలు ఎగుమతి అవుతాయి. చిన్నబొమ్మల తయారీకి జిగురు మట్టిని నానబెట్టి కాగిత గుజ్జు, నావసుద్ధ కలిపి మెత్తగా కుమ్మి మిశ్రమం తయారు చేస్తారు. పెద్దపెద్ద బొమ్మలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేస్తారు. ముందుగా మూసలు తయారు చేసుకుని వాటి ఆధారంగా తీర్చిదిద్దుతారు. పెద్ద విగ్రహాలు అయితే విడి భాగాలు తయారుచేసి వాటిని అతుకుతారు. ఇక్కడ తయారైన బొమ్మలను కర్ణాటక, ఒడిసా, మహారాష్ట్ర, నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మంచిర్యాల తరలించి అక్కడ విక్రయిస్తారు. ప్రతి సీజన్లోనూ రూ.కోటి నుంచి రూ.కోటీ 50 లక్షల వరకు విలువైన బొమ్మలు ఇక్కడి నుంచి ఎగుమతి అవుతాయి. ప్రముఖ శిల్పి పెద్దిరెడ్డి వెంకటకృష్ణ మాధవరావు ఆర్డరుపై దేశ నాయకులు, రాజకీయ నాయకులు, ప్రముఖుల విగ్రహాలు తయారు చేస్తారు.



గణనాథుల ప్రతిమలను తయారు చేస్తున్న శిల్ప కళాకారులు

కూలీల కొరత, కూలీ రేట్లు పెరిగిపోవడం, ముడి సరుకుల రేట్లు పెరిగిపోవడం వంటి వాటితో బొమ్మల తయారీలో గిట్టుబాటు కరువైంది. దీంతో ఇటీవల బొమ్మల తయారీ కొంత తగ్గింది. కళాకారుల జీవనోపాధి దెబ్బతింది. కొంత మంది యువత ఈ వృత్తికి స్వస్తి పలికి ప్రత్యామ్నాయ వృత్తుల వైపు వెళ్లారు. మరికొంతమంది అయితే ఇతర వృత్తులు చేపట్టలేక, వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని వదులుకోలేక కాలక్షేపం చేస్తూ ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. బొమ్మల తయారీని ప్రభుత్వం కుటీర పరిశ్రమగా గుర్తించి కళాకారులకు ఆర్థిక చేయూత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

## ప్రభుత్వం ఆర్థిక చేయూతనివ్వాలి

**కొమ్మిరెడ్డి రాజేశ్వరి, శిల్ప కళాకారిణి**



అత్తింటివారి సంప్రదాయబద్ధంగా వస్తున్న బొమ్మల తయారీ నేర్చుకున్నా. పదేళ్ల నుంచి కుటుంబసభ్యులతో కలిసి బొమ్మలు తయారుచేస్తున్నా. దీంతో కొంత ఉపాధి లభిస్తోంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే బొమ్మల తయారీ వల్ల కళాకారులకు మరింత ఉపాధి చేకూరుతుంది.

## పెన్షన్ సదుపాయం కల్పించాలి

**కొమ్మిరెడ్డి సూర్యచంద్రరావు, శిల్ప కళాకారుడు**



40 ఏళ్లుగా బొమ్మలు తయారు చేస్తున్నాం. అంతగా గిట్టుబాటు లేదు. అలవాటైన వృత్తిని వదులుకోలేక బొమ్మలనే తయారు చేస్తున్నాం. బొమ్మలకు పెయింటింగ్ వేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కంటిచూపు మందగిస్తుంది. 50 ఏళ్లు నిండిన కళాకారులకు పెన్షన్ సదుపాయం కల్పించాలి. ప్రత్యేక సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

## గిట్టుబాటు ధర కరువైంది

**మహాదశ సత్యగణేశ్వరరావు, శిల్పి**



గత 40 ఏళ్లుగా ఇదే వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుతం అంతగా గిట్టుబాటు లభించ్లేదు. తయారీ భారంగా మారింది. ప్రభుత్వం ప్రోత్సాహం లభించట్లేదు. కూలీల కొరత, ముడిసరుకు రేట్లు పెరిగిపోవడంతో బొమ్మల తయారీ గిట్టుబాటు కావట్లేదు.

## కుటీర పరిశ్రమగా ప్రోత్సహించాలి

**పెద్దిరెడ్డి సత్యనారాయణమూర్తి, శిల్పి**



మా తాతల నాటి నుంచీ సంప్రదాయంగా వస్తున్న ఈవృత్తిని మేమూ సాగిస్తున్నాం. 40 ఏళ్లుగా బొమ్మలు, విగ్రహాల తయారీలో ఉన్నాను. వాటికి డిమాండ్ ఉన్నా గిట్టుబాటు లభించట్లేదు. పరిశ్రమను నడపలేక పోతున్నాం. రోజంతా శ్రమించినా రోజు కూలీ మాత్రమే కిడుతోంది. ప్రభుత్వం కుటీర పరిశ్రమగా గుర్తించి ప్రోత్సహించాలి.



కాకినాడలో విద్యార్థులకు తోలుబొమ్మలాట జానపద కళపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

# కళను బతికిద్దాం!

- భవిష్యత్తు తరాలకు దూరమవుతున్న జానపద కళలు
- ఆదుకోవాలంటున్న కళాకారులు
- నేడు అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం

కార్పొరేషన్(కాకినాడ),ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): జానపదకళలకు ఒకప్పుడు ఎంతో ప్రాచుర్యం ఉండేది. కాలక్రమంలో జానపదం మసకబారుతోంది. ఇవి ప్రజలనుంచి సంక్రమించిన కళారూపాలు. ఇవి సాధారణంగా ఒకప్రాంతం లేదా సంస్కృతికి ప్రత్యేకమైనవి. గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే విశిష్ట సంప్రదాయానికి సజీవ సాక్ష్యమైన జానపదకళలు కనుమరుగవుతున్నాయి. కళనే నమ్ముకున్న వేలాదిమంది కళాకారులు రోడ్డున పడుతున్నారు. కళలు వెలుగులోకి రావడంలేదు. కళాకారులకు పొట్ట గడవని దుస్థితి ఏర్పడింది. ఆధునికత, ప్రపంచీకరణ, సామాజిక మార్పులు, పాశ్చాత్య సంస్కృతి ప్రభావం కళలను దెబ్బతీశాయి. జానపదకళలు ప్రజల్లో అవగాహనతోపాటు చైతన్యం నింపేదుకు ఉపయోగపడతాయి. నేడు అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

### జానపద కళలు..

జముకుల కథ, తంబుర్ర కథ, బుర్రకథ, తోలుబొమ్మలాట, ఒగ్గు కథ, యక్షగానం, గొల్ల సుద్దులు, వీధినాటకాలు, పగటి వేషాలు, జడకోలలు, కోలాటం జానపద కళలు అంటారు.

### జమునానగర్‌లో తోలుబొమ్మలాట

ఆనాటి ప్రముఖ సినీనటి జమున కళాకారుల చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు కాకినాడరూరల్ మాధవపట్నం సమీపంలో కళాకారులకు ఒకకాలనీ నిర్మించి దానికి జమునానగర్‌గా పేరు పెట్టారు. ఇప్పటికీ అక్కడ తోలుబొమ్మలాట కళాకారులు జీవనం సాగిస్తూ తోలుబొమ్మలాటను సజీవంగా తర్వాత తరానికి కూడా అందించేలా కొత్తవారికి శిక్షణ తరగతులు నిర్వహిస్తూ ముందుకెళ్తున్నారు.

### జిల్లాలో జానపద కళల స్థితి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జానపద కళాకారులు కొందరు కళనే వృత్తిగా చేసుకొని జీవనపాధి పొందుతుంటే మరికొందరు పూట గడవని స్థితిలో ఉన్నారు. ఉత్సవాలు, పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంలో తప్ప వీరి ప్రదర్శనలకు వీలు లేకుండా పోయింది. కొందరు పెన్షన్ అందుకుంటున్నా ఆ డబ్బులు సరిపోక గ్రామాలు తిరుగుతూ పొట్ట పోసుకుంటున్నారు.

### కళలకు ప్రాధాన్యమివ్వాలి



కళలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. జమునగర్‌లో తోలుబొమ్మలాటపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వ పథకాలను ఈ తోలుబొమ్మలాటద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇంకా సహాయం అందాలి.

**-తోట పవన్‌కుమార్, గోల్డ్ మెడల్ లిస్ట్, ప్రముఖ తోలుబోమ్మలాట కళాకారుడు**

### కళాకారులకు న్యాయం చేయాలి



ప్రభుత్వం పేద జానపద కళాకారులను ఆదుకుని న్యాయం చేయాలి. కనుమరుగవుతున్న కళలను తర్వాత తరానికి అందించేలా చర్యలు చేపట్టాలి. కళాకారుల గుర్తింపులో ప్రభుత్వం ప్రధాన భూమి క పోషించాలి.

**-పక్కి మణిబాల, జానపద కళాకారిణి**

### పూర్వ వైభవం తీసుకురావాలి



గతంలో కళలద్వారా జీవనపాధి పొందేవారు.ఇప్పుడు ప్రభుత్వ పథకాల ప్రచారానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి. కళలకు పూర్వ వైభవం తీసు కురావాలి. కవులు, గాయకులు, కళాకారులు ఏకం కావాలి.

**-కెర్ల పుల్లారావు, నంది అవార్డు గ్రహీత, జానపద కళాకారుడు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స

# వైసీపీ.. జగన్.. ఇదే పాట పాలన ఏముంది?

- కూటమి ప్రభుత్వంపై బొత్స విమర్శలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం 14నెలల పాలనలో వైసీపీ..జగన్.. ఇదేపాట. విమర్శలు తప్ప, పాలన, పర్యవేక్షణలేదని శాసన మండలి వైసీపీ పక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజులలో రోడ్ల గోతులన్నీ పూడ్చేస్తామని చెప్పారని, ఏ రోడ్డూ బాగోలేదని, 20శాతం రోడ్లు కూడా వేయలేదన్నారు. ఉపాధి కూలీలకు 7వారాలుగా జీతాలు ఇవ్వకపోతే, ఎలా బతుకుతారని ఆయన ప్రశ్నించారు. ఇంటింటికీ కుళాయి పనులు ఆపేశారని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని, ఐదేళ్లలో వైసీపీ పాలన, 14నెలల కూటమి పాలనలో క్రైమ్ రేట్ బేరీజ్ వేసుకుంటే ప్రజలకు అర్థం అవుతుందన్నారు. ఇదేనా మంచిపాలన. ప్రజలకు తెలియాలని, భూకబ్జాలు, దోపిడీ లు పెరిగిపోయాయన్నారు. ఏదైనా మాట్లాడితే కేసులు పెడుతు న్నారని ఆరోపించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి పీడీఎస్ బియ్యం అక్రమాలను అరికడతామని చెప్పారుకదా, ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. కూటమి నేతలు సింగపూర్ పెట్టుబడుల కోసం వెళ్లలేదని, అక్కడ పెట్టుబడులు పెట్టడానికి వెళ్లారని ఆరోపించారు. పీ4 విధానంపై ప్రభుత్వానికే స్పష్టతలేదని విమర్శించారు. ఈసమావేశంలో మాజీ ఎంపీ మార్గాని భరత్, మా జీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు, శ్రీనివాసనాయుడు, పార్టీనేతలు గూడూరి శ్రీనివాసరావు, జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీపాదుల గ్రామోత్సవం

- పిఠాపురంలో శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం





పిఠాపురంలో శ్రీపాదశ్రీవల్లభుల వారి గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళలు, ప్రత్యేక అలంకారంలో సర్వపుష్పపూజ అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులు

పిఠాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురంలో శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు మహాగణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాద శ్రీవల్లభుల వారి మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్టానము, గణపతి అధర్వ ఉపనిషత్ పారాయణ, శ్రీగురుచరిత్ర పారాయణ, శ్రీపాదశ్రీవల్లభ చరిత్ర పారాయణ నిర్వహించారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, దత్త మంత్రహోమం, శ్రీపాద శ్రీవల్లభుల వారి దివ్య పాద పద్మాలకు వివిధ హారతులు, పల్లకీ సేవ జరిగాయి. సాయంకాలార్చన, మంగళహారతి నిర్వహించారు. సర్వపుష్ప పూజ అనంతరం శ్రీపాద శ్రీవల్లభులు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం శ్రీపాదుల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈవో ఆర్. సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# టీటీడీని భ్రష్టు పట్టించిన వైసీపీ

- పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నెహ్రూ

కాకినాడసిటీ, ఆగస్టు 21(ఆంధ్ర జ్యోతి): టీటీడీని భ్రష్టుపట్టించింది వైసీపీయేనని, దేవస్థానంపై ఆపార్టీ బురద చల్లే ప్రయత్నం చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ ధ్వజమెత్తారు. కాకినాడలోని టీడీపీజిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదు రోజులుగా వైసీపీ చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తి అవాస్తవాలన్నారు. అధికారంలో ఉండగా వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు, కల్యాణ వస్త్రాలు కుటుంబ సమేతంగా సమర్పించని జగన్మోహన్ రెడ్డి, కరుణాకరరెడ్డి టీటీడీ పవిత్రత గురించి మాట్లాడ్డం విడ్డూరంగా ఉందన్నారు. కరుణాకరరెడ్డి చైర్మన్‌గా ఉన్నప్పుడు తిరుపతిలో కారు డ్రైవర్లు దర్శనం టిక్కెట్లు అమ్మేవారన్నారు. తిరుమల లడ్డూ ఒక రోజులో పాడైపోయేదని, అన్నప్రసాదాన్ని కూడా పాలకమండలి భక్తులకు పూర్తిగా పెట్ట లేదన్నారు. ప్రొటోకాల్ తప్ప కొండపై ఎటువంటి సదుపాయాలు ఉపయోగించుకోని ప్రస్తుత చైర్మన్ బీఆర్ నాయుడువల్ల తిరుమల మసక బారుతోందని ఆరోపణలు చేస్తున్న వైసీపీ త్వర లోనే మసకబారనుందన్నారు. తిరుమల కొండ పై ఉన్నది నల్లరాయి... దానిని పూజిస్తే ఏం వస్తుందని మాట్లాడిన నాస్తికుడైన కరుణాకర రెడ్డి ఏనాడూ బొట్టు పెట్టుకోలేదన్నారు. టీటీడీ పవిత్రత గురించి మాట్లాడే నైతికత వైసీపీకి లేదన్నారు. తిరుమలలోని అన్యమత ఉద్యోగులకు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ, వేరే శాఖల్లోకి మారే అవకాశాన్ని పాలకమండలి కల్పించిందన్నారు. సామాన్య భక్తులకు రెండు, మూడు గంటల్లోనే దర్శనం కల్పించేలా సాంకేతికతను ఉపయోగించుకోనుందన్నారు. ఈ సమావేశంలో జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యుడు భూపాలపట్నం ప్రసాద్ పాల్గొన్నారు.

## వీరేశ్వరస్వామికి లక్ష రుద్రార్చన



వీరేశ్వరస్వామి సన్నిధిలో లక్ష రుద్రాక్షలు

ఐ.పోలవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసశివరాత్రిని పురస్కరించుకుని మురమళ్ల శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామికి గురువారం లక్ష రుద్రాక్ష పూజ జరిగింది. ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో 15మంది రుత్విక్కులతో లక్షరుద్రార్చన నిర్వహించారు. పుణ్యక్షేత్రం వారణాసి నుంచి తీసుకొచ్చిన రుద్రాక్షలను ఊరేగింపుగా గోదావరి తీరానికి తీసుకెళ్లి గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాక్షలకు సంప్రోక్షణ నిర్వహించారు.

# గిరిజన విజ్ఞానాన్ని పరిరక్షించుకుందాం

- నన్నయ ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ





పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, గిరిజన వీరుల చిత్రప్రదర్శనను తిలకిస్తున్న వీసీ, విదేశీ అధ్యాపకులు

దివాన్‌చెరువు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గిరిజనవిజ్ఞానాన్ని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ వర్శిటీ విద్యా కళాశాల ఆధ్వర్యంలో గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణ భవిష్యత్ తరాలకు చేర్చడం అనే అంశంపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ గతాన్ని కాపాడుకోవడం ద్వారా భవిష్యత్ శక్తివంతంగా మారుతుందన్నారు. మన దేశీయ జ్ఞానం స్థిరమైన జీవనానికి కీలకమని చెప్పారు. స్థానిక సంఘాలను సాధికారపరచాలని, గిరిజన సంఘాలు, సాంప్రదాయ వైద్యులు, జానపద కళాకారులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. గిరిజన సంస్కృతి, విజ్ఞానం, పరిరక్షణ నుంచి సాధికారత వరకూ విశ్వవిద్యాలయాలు కృషి చేయాలన్నారు. సదస్సుకు సంబంధించిన 39 పరిశోధనపత్రాలతో ప్రచురించిన పుస్తకాలను, గిరిజన తొలి స్వాతంత్ర్య సమరయోధుల పుస్తకాలను వీసీ ఆవిష్కరించారు. విద్యాకళాశాల, రాజమహేంద్రవరం ట్రైనింగ్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన గిరిజన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. న్యూఢిల్లీలోని గిరిజన తెగల జాతీయ కమిషన్ ముద్రించిన గిరిజన స్వాతంత్ర్య సమరయోధులు, గిరిజన హక్కులు చిత్రపటాల ప్రదర్శనను ఆంధ్ర వనవాసీ కళ్యాణ శ్రమ సహకారంతో ఏర్పాటుచేశారు. దీనిని వీసీ ప్రారంభించి ఇతోపియా విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన థెసిమా గబ్రెకు ఇరాక్ నుంచి వచ్చిన బతుల్ అలీకు గిరిజన స్వాతంత్ర్యవీరులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ఏయూ నుంచి ఆచార్య వి.సుబ్రహ్మణ్యం, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం పరిపాలనాధికారి ఎస్‌వీఎస్ సూర్యనారాయణ, ఒరిస్సా కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి ఇ.అశోక్‌కుమార్, హరిశంకర్ గౌర్ కేంద్రీయ విద్యాలయం నుంచి పి.చిట్టిబాబు, పలువురు నన్నయ వర్శిటీ అధికారులు పాల్గొన్నారు.



సత్యదేవుడి దర్శనానంతరం ఎమ్మెల్సీ కల్యాణి, మాజీ మంత్రి రోజా

## సత్యదేవుడి సన్నిధిలో మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్సీ కల్యాణి పూజలు

అన్నవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం మాజీమంత్రి ఆర్.కె రోజా, ఎమ్మెల్సీ వరుది కల్యాణి కుటుంబసభ్యులతో స్వామివారి వ్రతమాచరించి ప్రత్యేకపూజలు నిర్వహిచి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

### సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత లక్ష్మణరావు

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ. 1,01,116లు విరాళంగా సమర్పించారు. తణుకుకు చెందిన కాటూరి లక్ష్మణరావు, విజయ వెంకటలక్ష్మి దంపతులు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శనం కల్పించారు.

## ఎమ్మెల్యేతోపాటు సమానంగా భాగస్వామ్యం కల్పించాలి

- 'పిల్లి'ని బుజ్జగించిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



మాట్లాడుతున్న టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే వర్మ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనుల్లో ఎమ్మెల్యేతోపాటు సమానంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పిస్తేనే కేడర్, ప్రజలకు న్యాయం జరుగుతుందని, ఈవిషయంపై టీడీపీ అధిష్ఠానం నిర్దిష్ట వైఖరి చెప్పాలని పిల్లి సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. టీడీపీ కో-ఆర్డినేటర్ పదవికి ఆయన రాజీనా మా చేసిన నేపథ్యంలో అధిష్ఠానం ఆదేశం మేరకు ఆయన్ని బుజ్జగించేందుకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ గురువారం వలసపాకలలోని నివాసంలో కలుసుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడి ఎంపికపై పార్టీ కోఆర్డినేటర్, పార్టీ పరిశీలకుల వైఖరి కారణంగా చోటు చేసుకున్న పరిణామాలు, జనసేన ఎమ్మెల్యే నుంచి టీడీపీకి ఎదురవుతున్న సహాయ నిరాకరణ వంటి విష యాలను పిల్లి సత్యనారాయణమూర్తి వివరించారు. అధికారంలో ఉండి పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ఏమీ చేయలేని స్థితిలో కోఆర్డి నేటర్‌గా కొనసాగడం ఇష్టంలేక ఈ పదవికి రాజీనామా చేశామ ని, క్రియాశీలక కార్యకర్తగా కొనసాగుతానని స్పష్టం చేశారు. టీడీపీలో అత్యంత సీనియర్, ఉమ్మడి జిల్లాలోనే శెట్టిబలిజ సామాజిక వర్గంలో బలమైన నాయకుడు సత్యనారాయణమూర్తి అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు. కూటమినాయకుల మధ్య కొన్ని సమస్యలు ఉండటం సహజమన్నారు. వీటి ని కూర్చుని పరిష్కరించుకుంటామన్నారు. పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీని వాసరావు, ఇన్‌చార్జి మంత్రి నారాయణల ఆదేశాలమేరకు సత్యనారాయణ తో చర్చిం చేందుకు వచ్చామన్నారు. మండలపార్టీ ఎన్నిక వాయిదా వేశామని, త్వరలో ఇద్దరు పార్టీ సీనియర్ పరిశీలకులతో పూర్తి పారదర్శకంగా కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. వారంరోజుల్లో సీఎం చంద్రబాబుతో పిల్లి దంపతులతో సమావేశమయ్యామన్నారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పార్టీపెద్దల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

# గోదావరి ఉగ్రరూపం


ధవళేశ్వరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నది

● ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ ● రెండో ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతున్న నీటిమట్టం
● పునరావాస కేంద్రాలకు లోతట్టు ప్రాంతాల జనం తరలింపు ● అప్రమత్తమైన యంత్రాంగం

**గోదావరి ఉప్పొంగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలతో ఇక్కడ ఉధృతి పెరుగుతోంది. నీటిమట్టం పెరగడంతో ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. 11 లక్షలకు పైగా క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. దీంతో కోనసీమ లోని గౌతమి, వృద్ధగౌతమి, వైనతేయ, తదితర నదీపాయల్లోకి వరదనీరు వచ్చి చేరడంతో ఆత్రేయపురం, ఆలమూరు, రావులపాలెం, కె.గంగవరం, అయినవిల్లి, మామిడికుదురు, పి.గన్నవరం, ముమ్మిడివరం తదితర ప్రాంతాల్లో వరద పోటెత్తింది. ముమ్మిడివరంలో కూరగాయల పంటలు, కొబ్బరితోటలు నీటమునిగాయి. పి.గన్నవరం మండలం లో కనకాయలంక కాజ్‌వే పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకోగా ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఏజెన్సీలోనూ శబరి, సీలేరు నదులకు వరద పోటెత్తడంతో చింతూరు, వర రామచంద్రపురం, ఎటపాక, కూనవరం, తదితర ప్రాంతాల్లో లోతట్టు గ్రామాలు నీటమునిగాయి.**

ధవళేశ్వరం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో ధవళేశ్వరం వద్ద గోదావరి అంతకంతకూ ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం నుంచి పెరుగుతున్న నీటిమట్టం గురువారం ఉదయం 6.50 గంటలకు 11.75 అడుగులకు చేరడంతో ఫ్లడ్ కంజర్వేటర్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 9.85 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి వదిలారు. ఆపై గంటకు సరాసరి 10 వేల క్యూసెక్కులు చొప్పున ప్రవాహం పెరుగుతూ రెండో ప్రమాద హెచ్చరిక దిశగా ఉరకలేస్తోంది. గురువారం రాత్రి ఏడుగంటలకు నది నీటిమట్టం 13 అడుగులకు చేరుకోగా, 11,65, 473 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి ప్రవహిస్తోంది. రాత్రి పది గంటలకు 13,30 క్యూసెక్కులుకు చేరుకుంది. అర్థరాత్రి దాటిన తరువాత నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి 13.75 అడుగులకు చేరుకుంటుందని అధికారుల అంచనా. ఇదే సమయంలో పరీవాహక ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరే వరద తగ్గడంతో కాళేశ్వరం, పేరూరు వద్ద నీటిమట్టం తగ్గుతుండగా, భద్రాచలం వద్ద నిలకడగా కొనసాగుతోంది. రాత్రి పది గంటలకు 52 అడు గులు తగ్గింది.

● ఎగువన భద్రాచలం వద్ద బుధవారం ఉదయం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగా 13 గంటల వ్యవధిలో రాత్రి 10 గంటలకు నీటి మట్టం 48.10 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. ఆపై క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం గురువారం సాయంత్రం 5 గంటలకు 52.10 అడుగులకు చేరుకుని నిలకడగా కొనసాగుతోంది

● ఎగువ నీటిమట్టాలు ఇవే...

ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టం తగ్గుదల నమోదయ్యింది. గురువారం సాయంత్రం 6 గంటలకు కాళేశ్వరం వద్ద 10.85 మీటర్లు, పేరూరు వద్ద 16.60 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 14.14 మీటర్లు, భద్రాచలం వద్ద 52.10 అడుగులు, కూనవరం వద్ద 20.25 మీటర్లు, కుంట వద్ద 11.37 మీటర్లు, పోలవరం వద్ద 12.84 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.39 మీటర్లుగా నీటిమ ట్టం నమోదయింది.

● డెల్టా కాలువలకు 9100 క్యూసెక్కులు

డెల్టా పరిధిలో వర్షాలు తగ్గుముఖం పట్టి ఎండ తీవ్రత పెరుగుతుండటంతో వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. తూర్పుడెల్టాకు 3800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1500క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3800 క్యూసెక్కులు చొప్పున మొత్తం 9100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

**కొవ్వూరు:** నదీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ నుంచి అధికంగా వరద రావడంతో కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని స్నాన ఘట్టాలు పూర్తిగా నీట మునిగాయి. ఎగు వన భద్రాచలం, దిగువన ధవళేశ్వరం బ్యారేజీల వద్ద ప్రమాద హెచ్చరికలు దాటి నది ఉప్పొంగుతోంది. వరద మరింత పెరిగితే శుక్రవారం ఉదయానికి ప్రవాహం గోష్పాదక్షేత్రంలోకి చేరే అవకాశం ఉంది. డివిజనల్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు.

### సఖినేటిపల్లిరేవులో రాకపోకలు బంద్

**అంతర్వేది:** వరద ఉధృతి పెరగడంతో సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో రాకపోకలను గురువారం ఉదయం నుంచి నిలిపివేశారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే సఖినేటిపల్లిరేవు పంట్లు, పడవలను నిలుపుదల చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. మరో పక్క ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు దిండి-చించినాడ వంతెనపై రాకపోకలు నిలుపుదలచేస్తూ సర్క్యులర్ ఇవ్వగా, వరద నేపథ్యంలో సఖినేటిపల్లి రేవులో కూడా రాకపోకలను బంద్ చేయడంతో వెంటనే స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కలెక్టర్, పోలీసు అధికారులతో మాట్లాడి వంతెనపై ఆంక్షలు సడలించి వాహనదారులకు అనుమతిచ్చారు. దీంతో ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## ఏజెన్సీలోనూ అదే పరిస్థితి..


కూనవరం చుట్టూ చేరిన వరద నీరు

**చింతూరు:** చింతూరు వద్ద గోదావరి వరద ఉధృతి గురువారం మరింతగా పెరిగింది. భద్రాచలం వద్ద గురువారం రాత్రి ఎనిమిది గంటలకు 51.90 అడుగుల మేర ప్రవహిస్తోంది. కూనవరం వద్ద గోదావరి 47 అడుగులు, చింతూరు వద్ద శబరి నది 37 అడుగుల మేర ప్రవహిస్తోంది. దీంతో చిం తూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో ఎటుచూసినా వరద నీరే కనిపిస్తోంది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. 30వ నెంబరు జాతీయ రహదారిపై నీరు చేరడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనాలు చింతూరు మండలం ఎర్రంపేట వద్ద బారులు తీరాయి. ఈమండలాల్లో నాలుగు రోజులుగా లోతట్టు వాసులు జల దిగ్బంధంలోనే ఉన్నారు. 326వ నెంబర్ జాతీయ రహదారిపై నెల్లిపాక సమీపంలో వరద నీరు వచ్చి చేరడంతో చింతూరు నుంచి భద్రాచలం వెళ్లే వాహనాలు వయా లక్ష్మీపురం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. వరద కారణంగా చింతూరు మండలంలో ఎనిమిది గ్రామాలకు, కూనవరం మండలంలోని పది గ్రామాలకు, వరరామచంద్రపురం మండలంలో 12 గ్రామాలకు, ఎటపాక మండలంలో పన్నెండు గ్రామాలకు వెళ్లే రహదారులు నీట మునిగినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. శ్రీరామగిరి, రామవరం, జీడిగుప్ప, చిన్నమట్టపల్లి, తుమ్మిలేరు గ్రామ పంచాయతీల పరిధిలోని 28 గ్రామాలకు చెందిన ప్రజలు వరద ప్రభావాన్ని ఎదుర్కొంటున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

## ప్రమాదకరంగా లంక గ్రామాలు


గంటిపెదపూడి బూరుగులంక నదిపాయలో బోటు నుంచి విద్యార్థులను దింపుతున్న అగ్నిమాపక సిబ్బంది

పి.గన్నవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద పోటెత్తడంతో దిగువన నదీపాయలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. దీంతో లంకగ్రామాల్లోకి నీరు నెమ్మదిగా వచ్చి చేరు తోంది. పి.గన్నవరం మండలంలోని బూరుగులంక నదిపాయ ఉధృతంగా ప్రవహించడంతో ఐలాండ్‌పై ఉన్న ఉడి మూడిలంక, పెదపూడి లంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకర ప్రవాహంలో నదీపాయ దాటడానికి భయాందోళనకు గురవుతున్నారు. వరదనీరు ఏటిగట్టును తాకుతూ... చెంతనే ఉన్న మినీ కాజ్‌వే పైకి చేరుతోంది. కనకాయలంక కాజ్‌వే పూర్తి జలదిగ్బంధంతో లంకగ్రామంలోని ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మానేపల్లి శివారు శివాయిలంకకి వెళ్లే రహదారిపైకి వరద వచ్చి చేరుతోంది. పల్లిపాలెంలో నెమ్మదిగా ఇళ్ల వద్దకు చేరుకుంటోంది. పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలైన అనగార్లంక, పెదమల్లంక, అయోధ్యలంక వాసులు నాటుపడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

### రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్- 2025లో

## ప్రథమ బహుమతి విజేత అమలాపురం టీమ్


నగదు బహుమతిని అందుకుంటున్న అనిల్ అండ్ శ్రీ టీమ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం హోటల్ మంజీరాలో భవాని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహించిన రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025లో 150 టీమ్‌లు వారి ఆవిష్కరణలతో హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరుకాగా, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జనసేన రాజమహేంద్రవరం నగరం అధ్యక్షుడు వై. శ్రీను, తదితరులు పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో ప్రథమ బహుమతిని అమలాపురానికి చెందిన అనిల్ అండ్ శ్రీ టీం హెల్ప్‌టూ డిసబుల్ ప్రాజెక్టు కైవసం చేసుకుంది. ఇందుకుగాను ప్రథమ బహుమతి కింద రూ.లక్షా 75 వేలు నగదు చెక్కును ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి అందించారు. అదేవిధంగా ద్వితీయ బహుమతిని విశాఖపట్నంకు చెందిన చెన్న వైష్ణవి, శంకర్ డిటీమ్‌పేజో ప్రాజెక్టుకు కైవసం చేసుకుంది. దీనికి రూ.లక్ష నగదు చెక్కును అందించారు. అలాగే తృతీయ బహుమతికి శ్రీకాకుళంకు చెందిన సాయికిరణ్ రూపొందించిన డ్యూయల్ అలెర్ట్ సిస్టమ్ ప్రాజెక్టు కైవసం చేసుకుంది. బహుమతిగా రూ.75 వేలు నగదు చెక్కును అందించారు.

## గంజాయి మత్తులోనే హత్యలు?

● పోలీసులకు లొంగిపోయిన నిందితుడు కోటేశ్వరరావు


కోటేశ్వరరావు

నల్లజర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలంలోని ఘంటవారి గూడెంలో సంచలనం సృష్టించిన దంపతుల హత్య కేసులో నిందితుడు, గంగన్నగూడెంకి చెందిన మారిదు కోటేశ్వరరావు గురువారం నల్లజర్ల పోలీసులకు లొంగిపోయాడు. గంజాయి మత్తు లోనే దారుణానికి పాల్పడినట్టు స్థానికులు పేర్కొంటున్నారు. అత్తమామలను చంపిన అనంతరం నిందితుడు తన తల్లికి ఫోన్ చేసి మాట్లాడుతూ తన అత్తమామలను నరికి చంపేశాను. మూడు నెలలు జైల్లో ఉండి వస్తాను... నువ్వు కంగారు పడొద్దని సంఘటనా స్థలం నుంచే మాట్లాడినట్టు అక్కడివారు చెబుతున్నారు. కాగా, మామ ఏకుల సుబ్బారావు, శారద మృతదేహాలకు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

### మావోయిస్టులపై మరో ఏడాది ..

## నిషేధం పొడిగింపు

● ప్రజా రక్షణ చట్టం మేరకు అసాంఘిక చర్యలపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
● మావోయిస్టు అనుబంధ సంఘాలు, సంస్థలపైనా ...

రంపచోడవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), దాని అనుబంధ సంఘాలు, సంస్థలపై ఇప్పటివరకూ అమలులో ఉన్న నిషేధాన్ని మరో ఏడాదిపాటు పెంచుతూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రజా రక్షణ చట్టం, 1992 ప్రకారం ఈ నిషేధాజ్ఞలను ప్రభుత్వం జారీచేసింది. 2005 ఆగస్టు 17న ప్రభుత్వం రాష్ట్రంలో తొలిసారిగా మావోయిస్టులు, వారి అనుబంధ సంఘాలు, వ్యవస్థలపై నిషేధాన్ని విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏటా ఈ నిషేధాన్ని పొడిగించడం రివాజు. ఆ ప్రకారం ఈనెల 17 నుంచి మరో ఏడాది పాటు పొడిగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. అసాంఘిక సంఘంగా మావోయిస్టు పార్టీ, విప్లవ కార్మిక సమాఖ్య, సింగరేణి కార్మిక సమాఖ్య, రాడికల్ యూత్ లీగ్, రాడికల్ స్టూడెంట్స్ యూనియన్, రైతు కూలీ సంఘం, ఆలిండియా రివల్యూషనరీ యూత్ ఫెడరేషన్, రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్ తదితర సంఘాలపై ఈ నిషేధాజ్ఞలు మరో ఏడాదిపాటు కొనసాగుతున్నాయి.

## ఆలయాలే అతడి టార్గెట్

» పాత నేరస్థుడి అరెస్ట్
» కిలో బంగారం స్వాధీనం
» కాకినాడ ఎస్పీ బిందుమాధవ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గుళ్లు, గోపురాలే అతడి టార్గెట్. రద్దీగా ఉండే ప్రాంతాల్లో పార్కింగ్‌లో వాహనాలుంటే చాలు చేతికి పని చెప్తాడు. ఆ విధంగా గతేడాది, ఈ ఏడాది కలిపి ఐదు నేరాలకు పాల్పడ్డాడు. చివరికి అతని పాపం పండి కాకినాడ పోలీసులకు చిక్కాడు. నిందితుడి వద్ద నుంచి సుమారు కిలో బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను ఎస్పీ జి.బిందుమాధవ్ వెల్లడించారు. బుధవారం సాయంత్రం అన్నవరం కొండపై పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా ఎర్టిగా కారులో ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్లమూరు గ్రామానికి చెందిన 47 ఏళ్ల చింతా గణేష్‌గా నిర్ధారించారు. అతడు కారు డ్రైవర్.వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బులు సంపాదించాలని నేరాలను ప్రవృత్తిగా మార్చుకున్నాడు. 2020లో సాదాసీదాగా తన మొదటి దొంగతనాన్ని ప్రారంభించాడు. రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసి ఉన్న కార్లపై దృష్టి పడింది. 2024లో అన్నవరం కొండ మీద పార్క్ చేసి ఉన్న కారు డిక్కీలో భద్రపర్చిన సుమారు 257 గ్రాముల బంగారం, తిమ్మాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కారు డిక్కీలో నుంచి సుమారు 349.44 గ్రాముల బంగారం, పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమల ఆలయం వద్ద కారు డిక్కీలో నుంచి సుమారు 183 గ్రాముల బంగారం అపహరించాడు. 2025లో తిమ్మాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆగి ఉన్న కారు డిక్కీలో నుంచి సుమారు 155 గ్రాముల బంగారం తస్కరించాడు.బుధవారం అన్నవరం దేవస్థానం కొండపై పెళ్లిళ్లు ఎక్కువగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పడిన రద్దీతో కారు డిక్కీలో నుంచి సుమారు 45 గ్రాముల బంగారాన్ని దొంగిలించి కారులో పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా సీఐ సూర్యఅప్పారావు ఆధ్వర్యంలో ఎస్ఐలు శ్రీహరిబాబు, ప్రసాద్‌లు.. సిబ్బందితో గణేష్‌ను పట్టుకున్నారు. అతడిపై అన్నవరంలో 2, తిమ్మాపురంలో 2,ద్వారకా తిరుమలలో ఒక కేసు ఉన్నాయని, ఈ కేసుల్లో నిందితుడి నుంచి 989.44 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ పేర్కొన్నారు. నిందితుడ్ని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ సూర్యఅప్పారావు,ఎస్ఐలు శ్రీహరిబాబు, ప్రసాద్, సాంకేతికతను అందించిన ఐటీ కోర్ టీమ్ సీఐ డి.దుర్గాశేఖర్‌రెడ్డి,వారి సిబ్బందికి ఎస్పీ నగదు ప్రోత్సాహకాలు అందజేసి అభినందించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం

## టిక్కెట్ల జారీలో గందరగోళం

» నేడు పిఠాపురం పాదగయలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు
» తోపులాటలో భక్తురాలికి గాయాలు
» ఉదయం నుంచి భక్తుల పడిగాపులు
» నేతలను నిలదీసిన మహిళలు



టిక్కెట్ల కోసం నిరీక్షిస్తున్న మహిళలు, గాయపడిన మహిళ

పిఠాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరగనున్నాయి. వ్రతాల్లో పాల్గొనే మహిళలకు అందించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పది వేల చీరలు, పసుపు, కుంకుమ సమకూర్చారు. పూజా సామగ్రిని సిద్ధం చేశారు. ఏర్పాట్లను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షించారు. గురువారం మధ్యాహ్నం, సాయంత్రం రెండు విడతలుగా మహిళలకు టిక్కెట్లు జారీ చేశారు. కాగా ఈ ప్రక్రియ గందరగోళంగా మారింది. ఏర్పాట్ల విషయంలో ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో వ్యవహరించడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టిక్కెట్లు ఎప్పుడు జారీ చేస్తారో స్పష్టంగా తెలపకపోవడంతో పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు తెల్లవారుజాము నుంచే పాదగయకు తరలివచ్చి క్యూలైన్లలో బారులు దీరారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో టిక్కెట్ల జారీ ప్రారంభించారు. సగం మందికి టిక్కెట్లు పంపిణీ చేసి అయిపోయాయని చెప్పడంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ ఘటనలో పద్మావతి అనే మహిళకు గాయాలు కాగా పలువురు కిందపడిపోయారు. పది వేల మందికి వ్రతాలు అని చెప్పి టిక్కెట్లు లేవని చెప్పడం ఏమిటంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదగయ ఆవరణలోనే ఉండిపోయారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబును చుట్టుముట్టారు. ఇతర నాయకులను నిలదీశారు. తుమ్మల బాబు అప్పటికప్పుడు టిక్కెట్లు తెప్పించి పంపిణీ చేశారు. మొత్తం ఈ వ్యవహారంలో జనసేన నాయకులు, దేవదాయ, పోలీసు శాఖల అధికారుల మధ్య సమన్వయలోపం కనిపించింది.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు

## ఏసీబీకి చిక్కిన ఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్


కమిషనర్ సత్యనారాయణ, అరుణాచలం

ఏలేశ్వరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అవినీతి నిరోధకశాఖ అధికారులు గురువారం ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ ఎం.సత్యనారాయణను అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అరుణాచలంపై కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు ఏసీబీ డీఎస్పీ కిషోర్‌కుమార్ గురువారం వెల్లడించారు. నాలుగేళ్ల క్రితం పట్టణంలో కృష్ణాలయం వీధిలో అర్బన్ హెల్త్ ప్రైమరీ క్లినిక్‌ను, 2017లో సీసీ రోడ్లను కాంట్రాక్టర్ టి.రాజబాబు నిర్మించారు. ఈ పనులకు సంబంధించి రూ.8.05 లక్షలు కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సి ఉంది. ఈ బిల్లులు మంజూరు చేయాలంటే 3శాతం కమీషన్ ఇవ్వాలని కమిషనర్ డిమాండ్ చేశాడు. రూ.23 వేలకు ఒప్పందం కుదిరింది. ఆ సొమ్మును ఇవ్వడం ఇష్టం లేని రాజబాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సదరు సొమ్మును డేటా ఎంట్రీ ఆపరేటర్ (అవుట్ సోర్సింగ్) అరుణాచలానికి అతడి నివాసం వద్ద రాజబాబు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా కమిషనర్ కోరిక మేరకు నగదు తీసుకున్న నేపథ్యంలో ఇద్దరిపై కేసు నమోదు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నామని డీఎస్పీ కిషోర్‌కుమార్ తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కాకినాడ రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం శ్రీనివాసానగర్ నాల్గవ వీధిలో పాడుపడి శిథిలావస్థకు చేరిన ఇంటి విద్యుత్ వైర్లు తగిలి వర్షపు నీటిలో సుమారు 35 ఏళ్ల పురుషుడి మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యమైందని ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.వీఆర్వో ఇచ్చిన రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేశామని,సదరు వ్యక్తి చెత్త ఏరుకుంటూ ఆ ఇంటి లోపలికి ప్రవేశించి విద్యుత్ వైర్లు తగిలి మరణించి ఉంటాడని అనుమానిస్తున్నామన్నారు. మృతదేహం గుర్తుపట్టడానికి వీలులేకుండా కుళ్లి ఉందన్నారు.దేహంపై ఎరుపు రంగు పొడవాటి చేతుల టీషర్ట్, బూడిద రంగు ఫ్యాంటు ఉన్నాయన్నారు. ఎవరికైనా ఆ వ్యక్తి ఆచూకీ తెలిస్తే ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌కు లేదా 0884 -2363037 నెంబరుకు సమాచారమివ్వాలని సూచించారు.

## ఆటో ఢీకొని వ్యక్తి మృతి

బిక్కవోలు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు-ఊలపల్లి రోడ్డులో గురువారం మధ్యాహ్నం ఆటో ఢీకొని ఊలపల్లికి చెందిన రెడ్డి సూర్యభాస్కరరావు(34) మృతి చెందాడు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ వివరాల ప్రకారం.. సూర్యభాస్కరరావు ఉదయం ఊలపల్లి, బిక్కవోలు గ్రామాల మధ్యలో వున్న తన పొలానికి వెళ్లి పశువులకు గడ్డి కోసుకుని గ్లామర్ బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఊలపల్లి నుంచి బిక్కవోలు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో సూర్యభాస్కరరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవిచంద్రకుమార్ పేర్కొన్నారు.

## డ్రైన్‌లో వ్యక్తి మృతదేహం

మండపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండపేట బైపాస్ రోడ్డులోని డ్రైన్‌లో ఓ మృతదేహాన్ని స్థానికులు గురువారం గుర్తించారు. వారి సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కాగా మృతుడు మండపేటకు చెందిన ఉప్పాడ అశోక్‌గా గుర్తించామని ఎస్ఐ రాము తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ముగ్గురు ఇంజనీర్లకు షోకాజ్‌లు జారీ

» పోలవరం పునరావాస కాలనీల్లో అక్రమాలపై ప్రభుత్వ కొరడా
» విజిలెన్సు విచారణలో నాణ్యతా లోపాల గుర్తింపు

రంపచోడవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పోలవరం జాతీయ ప్రాజెక్టులో గిరిజన నిర్వాసితుల పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పన చర్యల్లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రంపచోడవరం గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం ద్వారా దేవీపట్నం, కూనవరం, వీఆర్ పురం మండలాల్లో చేపట్టిన పనులన్నిటిపైనా జరిగిన విజిలెన్సు విచారణలో అనేక అక్రమాలు వెలుగు చూశాయి. నాణ్యతా ప్రమాణాలు లేకుండా ఆయా కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లింపు జరిగేలా సిఫార్సు చేసిన అప్పటి ఇంజనీర్లపై చర్యలను చేపట్టింది. ఈ మేరకు ముగ్గురు ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం గురువారం నాలుగు వేర్వేరు ఉత్తర్వులను జారీ చేసింది. దేవీపట్నం మండలంలోని నేరేడువలస, ముసళ్లకుంట, కంబలంపాలెం, పోలవరం పునరావాస కాలనీల్లో 465 మంది నిర్వాసితుల కోసం సుమారు రూ.53 కోట్లతో చేపట్టిన అంతర్గత రోడ్లు, భవనాలు, డ్రైనేజీల నిర్మాణాల్లో నాణ్యతాలోపాలతో పనులు జరిగాయి. వీటిపై జరిగిన విజిలెన్సు తనిఖీల్లో లోపాలు బయటపడ్డాయి.పలు పనుల్లో నాణ్యతా లోపాలు జరిగి ఆయా బిల్లుల చెల్లింపునకు అనర్హంగా ఉన్నా వాటి చెల్లింపునకు అప్పటి ఈఈలు పి.రమాదేవి, జి.డేవిడ్ రాజు, డీఈఈ ఐ.శ్రీనివాసరావు సిఫార్సులు చేశారు. తదుపరి ఆయా లోపాలను సరిచేయడం ద్వారా ప్రభుత్వంపై అదనపు భారం పడింది.తద్వారా నిధుల దుర్వినియోగానికి ఆయా ఇంజనీర్లు కారణమయ్యారు.ఈ అంశాలను గుర్తించిన విజిలెన్సు అధికార్లు ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంతో ఆయా కాలనీల వారీగా ప్రభుత్వం చర్యలను చేపట్టింది. ఇందులో భాగంగానే ఈ ముగ్గురు ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలను చేపట్టి వారి నుంచి సంజాయిషీ కోరింది. ప్రభుత్వం జరిపే విచారణ అనంతరం బాధ్యులపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయి.

## 4వేల కిలోల బెల్లంతో మినీ వ్యాన్ సీజ్

ప్రత్తిపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు నల్లబెల్లం లోడుతో వెళుతున్న వ్యాన్‌ను సీజ్ చేశారు. ఎక్సైజ్ ప్రత్తిపాడు సీఐ పి.శివప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్తిపాడు సమీపంలోని యర్రవరం జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి నుంచి మినీ వ్యాన్‌లో 4వేల కిలోల నల్లబెల్లం రవాణా చేస్తుండడాన్ని గుర్తించారు. ఈ వ్యాన్ అనకాపల్లి నుంచి యర్రవరం వచ్చి అక్కడ నుంచి ఏలేశ్వరం మండల గ్రామాల వైపు వెళుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. నల్లబెల్లాన్ని, వ్యాన్‌ను సీజ్ చేసి లింగంపర్తికి చెందిన మనం నాగరాజును అరెస్ట్ చేశారు. బెల్లాన్ని పురమాయించిన గెద్దనపల్లికి చెందిన చిలపరశెట్టి వెంకటరమణపై కేసు నమోదు చేశారు.

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం



## జన సైనికుడికి ఆర్థిక సహాయం

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న జన సైనికుడు శనగశెట్టి నరేష్ ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన కార్యదర్శి, సాయిప్రియ సేవా సమితి వ్యవస్థాపకుడు జ్యోతుల శ్రీనివాస్ పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తదుపరి చికిత్సకు సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

## వైసీపీ బాధితులకు కూటమి ప్రభుత్వం అండ

**డీసీసీబీ చైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు)**

సామర్లకోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మోసపోయిన గృహ నిర్మాణ, ఇళ్ల స్థలాల లబ్దిదారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని డీసీసీబీ చైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు) భరోసా ఇచ్చారు. గురువారం మధ్యాహ్నం ఆ పార్టీ సమన్వయకర్త మంచెం సాయిబాబు అధ్యక్షతన బాధితులతో సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే జగదీష్‌మోహన్ (బాబు), సరోజా వాసు తదితరులు పాల్గొన్నారు. నాటి ప్రభుత్వంలో బాధితుల తరపున తాము కూడా ఉద్యమించి పోలీసు కేసులు ఎదుర్కొన్న విషయాన్ని బాబు గుర్తు చేశారు. తాను, ఎమ్మెల్యే చినరాజప్ప ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేకూరుస్తామన్నారు. అప్పటి వరకు లబ్ధిదారులు సంయమనం పాటించాలన్నారు. అత్తిలి కృష్ణ, తుమ్మల ప్రసాద్, చిన్నబాబు, జూరజ్, తోట సాయి, పెంకే వెంకటలక్ష్మి, చోడిశెట్టి ఇందిర, రాయుడు శ్రీదేవి, పన్నీరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులకు లోబడి గణపతి నవరాత్రులు జరుపుకోవాలి

**కరప తహసీల్దారు దుర్గాప్రసాద్**





సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు దుర్గాప్రసాద్

కరప, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అన్ని అనుమతులకు లోబడి ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రులు నిర్వహించుకోవాలని తహసీల్దారు తుమ్మల దుర్గాప్రసాద్ సూచించారు. గురువారం చంద్రన్న సమావేశ మందిరంలో ఆయా గ్రామాల గణేశ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటుచేసే గణేశ మండపాలకు విద్యుత్ స్తంభాలు, వైర్లు తగలకుండా జాగ్రత్తపడాలన్నారు. సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తూ మట్టి వినాయకులను పూజించాలని సూచించారు. ఎంపీడీవో మట్టపర్తి అనుపమ మాట్లాడుతూ పెనుగుదురు, వేళంగి, గొర్రిపూడి, అరట్లకట్ట, ఉప్పలంక గ్రామాల్లో నిమజ్జనం చేసే కాలువల వద్ద పంచాయతీల కార్యదర్శులు లైటింగ్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించారు. తొమ్మిది రోజులు మండపాల వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఉత్సవాల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తోట సునీత హెచ్చరించారు. పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో బొమ్మ ఎత్తు, నిమజ్జనం తేదీ, అనుమతి తదితర సమస్త సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. కమిటీల ప్రతినిధులు అప్రమత్తంగా ఉంటూ సహకరించాలని కోరారు. మత్స్య శాఖ ఏఐ కొత్తపల్లి మధుబాబు, డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దారు దుర్గాప్రసాద్, ఆర్‌ఐ పవన్, విద్యుత్ శాఖ జేఏ వీరభద్రరావు, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం పథకంలో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కోర్సుల్లో సెప్టెంబరు నుంచి మూడు నెలలు ఉచిత శిక్షణ ఇస్తామని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్ ఎయిర్ కండిషనర్ శిక్షణకు 16 నుంచి 45 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులు. 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ జిరాక్స్, ఇంటర్ పాస్ సర్టిఫికెట్, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ పొందుపరిచి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో సెప్టెంబరు ఒకటో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తు అందజేయాలి. మరిన్ని వివరాలకు 8790798431, 8500885866 నెంబర్లను సంప్రదించాలి.

## డిప్లొమా కోర్సుల్లో సీట్ల భర్తీకి ప్రకటన

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో సీట్ల భర్తీకి ప్రకటన విడుదలైంది. ఏపీఎస్ఏహెచ్‌పీ కౌన్సిల్ సెక్రటరీ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. తాజా ఆదేశాలను అనుసరించి డీఎంఎల్‌టీ-30, డీఏపీ-5, డీజీఆర్‌ఏ-6, డీడీఆర్ఆర్‌ఏ-6, డి.కార్డియో-6, డి.ఈసీజీ-8, డీఏఎస్ఎస్-30, డీఎంఐటీ-10 చొప్పున సీట్లు కేటాయించారు. ఇంటర్మీడియట్ బైపీసీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. ఆసక్తి కలిగిన వారు సెప్టెంబరు 8వ తేదీలోపు దరఖాస్తులను రంగరాయ వైద్య కళాశాలలో అందించాలి. 19వ తేదీ నాటికి కౌన్సెలింగ్ అలాట్‌మెంట్ పూర్తి చేస్తారు. సెప్టెంబరు 29న జాబితాను రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. అక్టోబరు 6వ తేదీ నాటికి తుది జాబితా వెల్లడిస్తారు. 24వ తేదీ నుంచి తరగతులు నిర్వహిస్తారు. దరఖాస్తులు, ఇతర వివరాల కోసం apsahpc.co.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

## ఆంధ్రప్రదేశ్‌లో పోస్టల్ ఐటీ ఆధునికీకరణ

**రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు ప్రశ్నకు కేంద్రం సమాధానం**



రాజ్యసభలో మాట్లాడుతున్న ఎంపీ సతీష్

కాకినాడ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పోస్టల్ ఐటీ ఆధునికీకరణ, డిజిటల్ సేవల్లో పురోగతి సాధించినట్టు కేంద్రం వెల్లడించింది. దీనిపై రాజ్యసభలో ఎంపీ సానా సతీష్‌బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ సమాధానమిచ్చింది. ఐటీ మోడర్నైజేషన్ ప్రాజెక్టు 2.0 కింద గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఏపీ పోస్టల్ సర్కిల్‌కు రూ.67.95 కోట్లు కేటాయించగా వాటిని పూర్తిగా వినియోగించారని వెల్లడించారు ఈ నిధుల వినియోగంతో రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసులు కంప్యూటరైజ్ అయ్యి పూర్తి నెట్‌వర్క్ కనెక్టివిటీ పొందాయన్నారు. తద్వారా పోస్టల్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ ప్రభుత్వ సేవలను డిజిటల్ రూపంలో సులువుగా అందిస్తున్నారన్నారు.

కాకినాడలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ శాఖ ఆర్థిక లావాదేవీల్లో ముందంజలో ఉందన్నారు. దీని ద్వారా 5.87 లక్షల ఖాతాలు తెరవగా రూ.77 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయన్నారు. అదనంగా ఆధార్ అప్‌డేట్స్, ఇన్సూరెన్స్, లోన్ సదుపాయం, వ్యాపారుల రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తున్నారన్నారు. పార్శిల్ పంపిణీ బలోపేతం కోసం రాష్ట్రంలో 8 నోడల్ డెలివరీ సెంటర్లు, 12 పార్శిల్ హబ్‌లు ఏర్పాటు చేశారన్నారు.



ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం ఇస్తున్న పేద రైతులు

## ‘తాము సాగు చేసుకుంటున్న భూమిని తిరిగి ఇప్పించాలి’

కాకినాడ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలో అధికారులు అతిగా ప్రవర్తిస్తూ యు.కొత్తపల్లి మండలం కొమరగిరి గ్రామ పరిధిలో సర్వే నెం.121, 122ల్లో పేద రైతులు సాగుచేసుకుంటున్న 19 ఎకరాల భూమిని పెత్తందారులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని సీపీఐ, సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, జిల్లా కార్యవర్గ సభ్యుడు సాకా రామకృష్ణ, సీపీఎం రైతు నాయకుడు వాసంశెట్టి చంద్రరావు గురువారం పేద రైతులతో కలిసి కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. గొల్లపల్లి సత్యనారాయణ, గొల్లపల్లి వీరభాస్కరరావు, కండేపల్లి శ్రీను, కండేపల్లి చంద్రరావు, గొల్లపల్లి కృష్ణ సత్యవేణి, కందిపల్లి లక్ష్మి, వాసంశెట్టి పద్మ తదితరులు పాల్గొన్నారు.



కరప, పిఠాపురం, గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయాల ఎదుట నినాదాలు చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

## కదంతొక్కి... గళమెత్తి

**సమస్యల పరిష్కారానికి అంగన్వాడీల డిమాండ్**



కాకినాడ రూరల్ తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

కరప, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు గురువారం ఆందోళన చేపట్టారు. నల్ల చీరలు ధరించి కరప తహసీల్దారు కార్యాలయం ఎదుట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంఘ మండల అధ్యక్షురాలు ఎ.వీరవేణి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలకు నిరసనగా బ్లాక్‌డే పాటిస్తున్నామన్నారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, మిగిలిన 1,810 మంది మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, నెట్‌వర్క్ సమస్య తలెత్తకుండా 5జీ నెట్, ట్యాబ్‌లు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలుచేయాలని, గ్రాట్యుటీ జీవోలో మార్పులు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దారు దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ వర్కర్స్-హెల్పర్స్ యూనియన్ మండల నాయకులు ఎం.భవానీ, ఎస్.వరలక్ష్మి, వి.నాగజ్యోతి, ఏబీ రత్నం, కె.సత్యవేణి పాల్గొన్నారు.

**పిఠాపురం (ఆంధ్రజ్యోతి):** సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. గతంలో ఇచ్చిన జీవోలను కూటమి ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్లు తగ్గించడంపై నిరసన తెలిపారు. కొత్త సెల్‌ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో యూనియన్ నాయకులు విజయశాంత, వెంకటలక్ష్మి, ప్రజావాణి, ఏసు నాగపద్మ, దుర్గాభవానీ, పద్మ, అరుణ, భారతి, సీఐటీయూ నాయకులు కుంచే చిన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి):** వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ జీవోలో మార్పులు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద మానవహారం నిర్మించి రాస్తారోకో జరిపారు. సెంటర్ల నిర్వహణకు 5జీ నెట్‌వర్క్‌తో ఉన్న ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యదర్శి నందీశ్వరుడు, యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి డి.తులసిదేవి, వెంకటలక్ష్మి, రాఘవమ్మ తదితరులు పాల్గొన్నారు.

**సామర్లకోట (ఆంధ్రజ్యోతి):** సామర్లకోట మండల, పట్టణ అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది సామర్లకోట తహసీల్దారు కార్యాలయం ఎదుట చేయిచేయి పట్టి మానవహారం నిర్మించారు. యూనియన్ అధ్యక్షురాలు వడ్డి ఎస్తేరురాణి, ఎన్.వరలక్ష్మి, ఎస్కే ఫాతిమా, పి.రాజేశ్వరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2014 నుంచీ వేతనాలు పెంచలేదని, సిబ్బందిపై పనిభారం పెరిగిందన్నారు. అంగన్వాడీ సెంటర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పని చేయట్లేదన్నారు. పలు యాప్‌లను ఒకే యాప్‌గా మార్చి పని ఒత్తిడి తగ్గించాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ ఇన్, అవుట్ రద్దు చేయాలని, సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలన్నారు. పీఎం మాతృవందనం పథకాన్ని కొత్తగా అంగన్వాడీలకు అప్పగించరాదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి యూనియన్ నాయకులు అందజేశారు. జి.మహాలక్ష్మి, మంగాలక్ష్మి, పి.సీతారత్నం, పద్మ, సుగుణ పాల్గొన్నారు.

**సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి):** అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కాకినాడ రూరల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లోని తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కాకినాడ రూరల్ మండల కార్యదర్శి టి.రాజా, ప్రాజెక్టు కార్యదర్శి వీరమణి ఆధ్వర్యంలో బ్లాక్‌డే నిర్వహించారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు పూర్తయినా ఐసీడీఎస్ అభివృద్ధికి నిధులు పెంచలేదన్నారు. ముఖచిత్రం యాప్ భారాన్ని తగ్గించాలన్నారు. నాలుగేళ్ల కిందట ఇచ్చిన స్మార్ట్ ఫోన్ నెట్వర్క్, నెట్ ఇతర సౌకర్యాలు లేక రిపోర్టులు ఇవ్వలేకపోతున్నామని, అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. సీఐటీయూ నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్, రాజేశ్వరి, తనూజ, వరలక్ష్మి, మహాలక్ష్మి, సత్యవేణి, చామంతి, అప్పలకొండ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్ విష్ణుమూర్తి, సభ్యులను అభినందిస్తున్న కూటమి నాయకులు

## యండమూరు సొసైటీ త్రిసభ కమిటీ ప్రమాణస్వీకారం

కరప, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యండమూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం గురువారం సొసైటీ కార్యాలయంలో జరిగింది. చైర్మన్‌గా వనుం విష్ణుమూర్తి, సభ్యులుగా గొల్లపల్లి వీరవెంకట సత్యనారాయణ (పెదకొత్తూరు), గంధం వెంకటలక్ష్మీనారాయణ (జి.బావారం) ప్రమాణం చేశారు. వారిని నాయకులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. సర్పంచ్ మారెళ్ల శ్రీనివాస్, సొసైటీ సీఈవో పెంకే శ్రీనివాస్, కూటమి నాయకులు గంజా దుర్గాప్రసాద్, మేడిశెట్టి పాండురంగ, ఆచంట సూరిబాబు, నున్న వీరబాబు, సాంబ, భవానీ, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



గణేశ ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు

## గణేశ ఉత్సవాల విజయవంతానికి పూజలు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): గణపతి నవరాత్రి మహోత్సవాలు విజయవంతంగా జరగాలని కోరుతూ గురువారం రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలోని ఆలయాల్లో కాకినాడ రూరల్ గణేశ ఉత్సవ సమితి కో-ఆర్డినేటర్ రంబాల వెంక టేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయక చవితి మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. బి.వెంకట రామకృష్ణ, పెండెం సత్యనా రాయణ, జి.శ్రీనివాసు, నందూరి సత్తిబాబు, గోపు వెంకటరమణ, పాలిక శివ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాడ శివాలయంలో మాస శివరాత్రి పూజలు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో శ్రావణ మాస శివరాత్రి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆవుపాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, పళ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, హరిద్ర కుంకుమ జలాలు, మానససరోవరం నుంచి తెచ్చిన గంగా జలాలతో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామిని అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు పుష్పాలతో అలంకరించారు.

## ‘శ్యామ్’ ఇనిస్టిట్యూట్ అధినేతకు దళిత, ప్రజా సంఘాల సత్కారం

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు నియామక పరీక్షల్లో అత్యధిక ఉద్యోగాలు సాధించిన శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత జి.శ్యామ్, డైరెక్టర్ శైలజ దంపతులను గురువారం దళిత, ప్రజా సంఘాల తరపున ఘనంగా సత్కరించారు. ఇంజనీర్ పిల్లి రామారావు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు అయితాబత్తుల రామేశ్వరరావు, బామెసెఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.కుమార్బాయి మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు ఉచితంగా, నామమాత్ర ఫీజుతో శిక్షణ ఇవ్వడంతో పాటు ఎందరికో సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న శ్యామ్ అభినందనీయుడన్నారు. మాజీ ఎంపీపీ వీరంశెట్టి, విశ్రాంత ఉద్యోగాల సంఘ నాయకుడు యాదాల సత్యనారాయణ, ఎల్ఎసీ నాగేశ్వరరావు, గోపి, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33కేవీఏ కరకుదురు ఫీడర్, మాధవపట్నం-రామేశ్వరం ఫీడర్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు ఏపీఎస్డీఎస్ ప్రభాకర్ తెలిపారు. మాధవపట్నం బైపాస్, తాళ్ళదొడ్డి, ఆర్‌బీ కొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జి.మేడపాడు, గోలివారికొత్తూరు, పెదబ్రహ్మదేవం, ఇళ్ళపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

## మాజీ మంత్రి కన్నబాబుకి పలువురి పరామర్శ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పితృ వియోగంతో వున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబును గురువారం పలువురు పరామర్శించారు. సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్నబాబు కుటుంబీకులకు మాజీ మంత్రులు పేర్ని నాని, పాముల శ్రీపుష్పవాణి, మాజీ ఎంపీలు చిట్టూరి రవీంద్ర, గొడ్డేటి మాధవి, చుండ్రు శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, కొత్తపల్లి భాగ్యలక్ష్మి, శోభా హైమావతి, నాగులాపల్లి ధనలక్ష్మి, బండారు సత్యానందరావు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, జనసేన నాయకుడు మారిశెట్టి రాఘవయ్య సానుభూతి తెలిపారు.



## విశ్వ సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ సూర్యారావు

కాకినాడ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విశ్వ సాహితీ కళా వేదిక కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ తురగా సూర్యారావు నియమితులయ్యారు. ఈ మేరకు అధ్యక్షురాలు కొల్లి రమావతి ఉత్తర్వు పంపారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీకి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు.



## జూనియర్ ఎన్టీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

కాకినాడ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ గురువారం భానుగుడి ఏరియాలో కాకినాడ సిటీ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ సభ్యులు ధర్నా చేశారు. కన్వీనర్ ఎండీ అన్వర్, నాయకులు భాస్కర్‌చౌదరి, సీహెచ్ ప్రసాద్, కాకినాడ సిటీ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు వి.దుర్గారావు, కార్యదర్శి శివ నాయుడు, జమీల్, మోహన్, వీరబాబు, అన్వర్, సుధీర్, శివగణేష్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి

రౌతులపూడి, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం లో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, కూటమి ప్రభుత్వంలో జరుగుతుందని మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు లాలం కృష్ణవేణి అన్నారు. గురువారం రాజవరంలో సీసీ రహదారులు నిర్మాణపనులను పరిశీలించి నూతన రహదారి పనులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఈగల సత్యఉపేంద్ర, రుత్తల చిట్టాబ్బాయి, కాతేడు దేవుడు, ఇప్పల వాసు, బక్కా రమణ, ఈగల చినలోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

## రెండు రోజులుగా జలదిగ్బంధంలోనే గ్రామాలు

### పలు గ్రామాల్లోకి చేరిన గోదావరి వరదనీరు



శ్రీరామగిరి గ్రామంలో వరదనీటిలో సామాన్లు మోసుకెళుతున్న బాధితులు

వీఆర్‌పురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి వర దల కారణంగా రెండు రోజు లుగా మండలంలోని 40 గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. అధికారులు పలు చోట్ల ఇంజన్ బోట్లు ఏర్పాటు చేశారు. గురువారం శ్రీరామగిరి, చింతరేవుపల్లి, వడ్డిగూడెం కాలనీ, వడ్డిగూడెం గ్రామాల్లో ఇళ్లలోకి గోదావరి వరదనీరు చేరింది. దీంతో ఆయా గ్రామాల వరద బాధితులు పునరావాస కేంద్రాలకు వెళ్తున్నారు. సీపీఎం నాయకులు శ్రీరామగిరి గ్రామంలో పర్యటించారు. ఎంపీపీ మాట్లాడుతూ వరద బాధితులకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేయాలన్నారు.

## వరద ముంపు గ్రామాల్లో పర్యటించిన ఎస్పీ, ఏఎస్పీ



వడ్డిగూడెంలో బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్దర్

విఆర్‌పురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్, చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా గురువారం వరద ముంపు వడ్డిగూడెం కాలనీ, వడ్డిగూడెం గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఎస్పీ వరద బాధితులతో మాట్లాడారు. వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. వరద బాధితుల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఎటపాక సీఐ కన్నప్పరాజు, వీఆర్‌పురం ఎస్ఐ సంతోష్ కుమార్, జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, నాయకులు బొర్ర నరేష్‌కుమార్, బొర్ర సూరి, ముత్యాల చంద్రశేఖర్, కోట్ల అప్పాజి వీఆర్వో గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

## అంధకారంలో 20 గిరిజన గ్రామాలు

### హుటాహుటీన జిల్లా కలెక్టర్ పర్యటన



కూనవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరి గోదావరి నదులు

కూనవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద మండల ప్రజలను మరోసారి భయభ్రాంతులకు గురిచేసింది. బుధ, గురువారం గోదావరి, శబ రి నదులు పొంగడంతో కూన వరం మండలంలోని సుమారు 47 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాకపోకలు స్తంభించిపోయాయి. శబరి ఏరియాలో 20 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆ గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. కూనవరంలోని గిన్నెలబజార్, ఉదయభాస్కర్ కాలనీ, కొత్తగూడెం గ్రామాల్లోని ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. దీంతో ఆ గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పోలవరం పరిహారం పనులు ఒకవైపు కొనసాగుతున్నాయన్నారు. విద్యుత్ ఉన్నతాధికారులు మండలంలో పర్యటించారు. స్థానిక అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదంటూ ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

## నిలిచిపోయిన వాహనాల రాకపోకలు

### పునరావాసం కేంద్రానికి గొల్లగూడెం గ్రామస్తుల తరలింపు



భద్రాచలం-కూనవరం రోడ్డులో నెల్లిపాకలో రహదారిపై వరద ప్రవాహం

ఎటపాక, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఉగ్ర రూపం దాల్చింది. గురు వారం సాయంత్రానికి భద్రాచలం వద్ద 52 అడుగుల నీటి మట్టానికి చేరుకుంది. దీంతో భద్రాచలం-కూనవరం రోడ్‌లో మురుమూరు, నెల్లిపాక, రాయనపేట ప్రధాన రహదారితో పాటు వీరాయిగూడెం-నెల్లిపాక మధ్యలో రహదారిపై వరద ప్రవాహం చేరడంతో రెండో రోజు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. గొల్లగూడెం గోదావరి ఒడ్డున నివసిస్తున్న కుటుంబాలను సీతాపురంలోని పునరావాస కేంద్రానికి తరలించారు. మరోవైపు ముంపు ప్రభావం ఉన్న రాచగొంపల్లి, నందిగామ, గొల్లగూడెం గ్రామాలను స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణరెడ్డి, తహశీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో ప్రేమ్ సాగర్ సందర్శించారు. వరదపట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. ముందస్తుగా పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు.

## గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు




కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

రంపచోడవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందేలా ఆదికర్మయోగి కార్యక్రమం ద్వారా ప్రజలను భాగస్వాములను చేస్తూ విలేజ్ విజన్‌మ్యాప్, యాక్షన్ ప్లాన్‌తో సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయనతో పాటు ఐటీడీఏ పీవో కట్టా సింహచలం హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు జి.శారదాదేవి, చంద్రకిరణ్, శిరీష, రామం, అచ్యుత్ కిరణ్, ధ్రువకుమార్, ఎంపీడీవోలు, వైద్యాధికారులు, ఇంజనీర్లు, సీడీపీవోలు మండల విద్యాశాఖాధికారులు, ఏటీడబ్ల్యువోలు పాల్గొన్నారు.

## వేగవంతంగా బంగారు కుటుంబాలను గుర్తించాలి

రంపచోడవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలను గుర్తించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన రంపచోడవరం నుంచి అన్ని మండలాల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నమోదైన మార్గదర్శులు, బంగారు కుటుంబాల వివరాలపై ఆరా తీశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారులు కె.సింహాచలం, అపూర్వ భరత్, సబ్ కలెక్టర్లు శుభం నొక్వాల్, సౌర్యమన్, జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మాలత, జిల్లా పీ4 ప్రత్యేక అధికారి, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎంవీఎస్ లోకేశ్వరరావు, డీజీపీవో కె.పి.చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## త్వరలోనే పరిహారం

చింతూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు త్వరలోనే పరిహారం, పునరావాసం కల్పిస్తామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టర్ కూనవరం మండలంలో పర్యటించారు. ఈసందర్భంగా పలువురు వరద బాధితులు ప్రతి ఏటా తాము పడుతున్న వరద కష్టాలను కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. రానున్న వరదలు నాటికి ముంపు గ్రామాలన్నింటిని పునరావాస కేంద్రాలకు తరలించనున్ననట్లు వెల్లడించారు. నీట మునిగిన కూనవరం మండలం పంద్రాసుపల్లి ముంపు ప్రాంతానికి ట్రాక్టర్‌పై కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్‌లు చేరుకుని అక్కడి బాధితులతో మాట్లాడారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

## ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

• ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం, రామవరంరోడ్డు వేయించాలని బుధవారం మాజీమంత్రి తోట నరసింహం నిరసన తెలియజేయ డంపై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పందించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి నరసింహం గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ రోడ్డును పూర్తి చేయలేదని చాలా స్పష్టంగా తెలియజేసినందుకు ముందుగా ఆయనను స్వాగతిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో రింగ్ రోడ్డు, సామర్లకోట గోకవరం రోడ్డు నేను శాంక్షన్ చేయించుకుంటే, రాజుపాలెం-రామవరం రోడ్డు రూ.29కోట్లు ఆనాటి పార్లమెంట్ సభ్యుడు తోట నరసింహం శాంక్షన్ చేయించుకున్నానని, ఈ రెండురోడ్లు నేను పూర్తి చేయించుకున్నానని ఆ రోడ్డుకు టెండర్లు పిలవకపోవడం తర్వాతే ఎన్నికల రావడం ఎన్నికల్లో వైసీపీ గెలిచిందన్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ఆ రోడ్డుతో పాటు 14 వర్కులు కలిపి కాసులకు కక్కుర్తిపడి గత వైసీపీ ప్రభుత్వం టెండర్లు పిలవడంతో ఆ పనులు సబ్ కాంట్రాక్టు ద్వారా డ్రైనేజీలు, కొద్దిదూరం సిమెంట్ రోడ్లు వేసి కాంట్రాక్టర్లు డబ్బులు చెల్లించకపోవడంతో ఆగిపోయాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆయనను ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు కాదని ఆయనను ఇన్‌చార్జ్‌గా సంవత్సర కాలం కొనసాగించారని ఆరోజు ప్రభుత్వంతో చెప్పి పూర్తిచేయాలని గుర్తు రాలేదా అని అన్నారు. ఈరోజు సంవత్సర కాలంలోనే కోట్లాది రూపాయలతో మల్లిసాల గోకవరం రోడ్డు, రామవరం ఇర్రిపాకరోడ్డు ఇలా అనేకరోడ్లు వేయించటమే కాకుండా సిమెంట్ రోడ్లు, నాలుగు గ్రామాలకు 3000 ఎకరాలకు మూడున్నర కోట్లతో 25న జ్యోతుల పాపారావు ఎత్తిపోతల పథకానికి కూడా టెండర్లు పిలుస్తామన్నారు. నేడు ఉమ్మడి జిల్లాలో రూ.42కోట్లు పనులకు, కాకినాడ జిల్లాకు రూ.32కోట్లు, అదేవిధంగా నియోజకవర్గంలో రూ.18కోట్లతో టెండర్లు పిలుస్తామన్నారు. రాజుపాలెం, రామవరం రోడ్డుకి తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.28లక్షల శాంక్షన్ చేయించి పనులు ప్రారంభిస్తున్నామన్నారు. గత 15 సంవత్స రాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలకంగా వ్యవహరించి సొంత రోడ్డు వేయించుకోకుండా నన్ను విమర్శించడం నీకు తగునా నరసింహ అని నెహ్రూ అన్నారు. కార్యక్ర మంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, వాసిరెడ్డి జేసుదాసు, సత్తి సదాశివరెడ్డి, చింతల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న గాంధీ

తొండంగి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటలో యాజమాన్య పద్దతులు పాటించాలని ఉద్యానవన శాఖాధికారి సుజాత తెలిపారు. గురువారం బెండపూడిలో మామిడి యాజమాన్య పద్దతులు, కొమ్మకత్తిరింపుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆగస్టు నెలాఖరునాటికి కొమ్మల కత్తిరింపు పూర్తి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వరప్రసాద్ మా ట్లాడుతూ ఉద్యాన రైతులకు సబ్సిడీపై బిందుసేద్య పరికరాలు అందిస్తున్నామని వాటిని వినియోగించుకోవాలన్నారు.

### విత్తనశుద్ధితో చీడపీడల నివారణ

శంఖవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విత్తనశుద్ధితో పంట తొలిదశలో ఆశించే చీడపీడలను నివారించవచ్చునని వ్యవసాయాధికారి పి.గాంధీ రైతులకు సూచించారు. అరెంపూడి గ్రామంలో పొలం పొలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు విత్తనశుద్ధి, ప్రాధాన్యం, దానికి వాడే సూడో మోనాష్, కార్బండిజిం వాడకం గురించి వివరించారు. భూసార పరీక్షలు, నీటి నాణ్యత, పరీక్షలు ఆవశ్యకత రైతులకు తెలిపారు. అనంతరం రైతులతో వరి నాడుమడులను పరిశీలించారు.

### అక్షరాస్యత పెంచేందుకు చర్యలు

కోటనందూరు, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్ష రాస్యులుగా చేయడమే వయోజన విద్య లక్ష్యమని వయోజన విద్య ఉపసంచాలకుడు పోశయ్య అన్నారు. గురువారం కోటనందూరు మండల పరిషత్ కార్యాలయంలో డీఆర్‌డీఏ ద్వారా 120మంది వలంటీర్లకు, డ్వా మా ద్వారా 70 మంది వలంటీర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అక్షరాస్యత పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈమేరకు అన్నిచర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో రాజేష్, జైరామ్, రాజ్‌గోపాల్, సూర్యకుమారి పాల్గొన్నారు.

### తుఫాన్‌లపై అప్రమత్తత అవసరం

● నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీధర్

తొండంగి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): తుఫానులపై అన్నిశాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీధర్ అధికార్లకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికార్లు, గ్రామ రెవెన్యూ అధికార్లు, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల లో తుఫాన్‌లు అధికంగా సంభవించే మాసాలైనందున దానికి తగిన రీతిలో ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్, రెవెన్యూ తదితర శాఖలు తుఫాన్లు సంభవిస్తే ఏవిధంగా ఎదుర్కోవాలన్నా దానిపై ప్రణాళిక తయారు చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైన వనరుల లభ్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ టి.కాంతారావు, ఎంపీడీవో సాయినవీన్, ఆర్ఐ రాజారావు పాల్గొన్నారు.

### ఎయిడ్స్ నివారణపై అవగాహన

జగ్గంపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): స్వరాజ్య అభ్యుదయ సేవా సమితి(ఎస్ఏఎస్ఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లోని విద్యార్థులకు గురువారం హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై సాస్ ప్రాజెక్టు మేనేజర్ రాజేష్ అవగాహన కల్పించారు. హెచ్ఐవీ ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు, వ్యాధి సోకిన వ్యక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారావు, జువాలజీ అధ్యాపకులు శ్రీనివాసరావు స్వరాజ్య అభ్యుదయ సేవ సమితి స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రాజేష్, సత్యనారాయణ, ఏఎన్ఎం సత్యవతి, ప్రాజెక్టు సభ్యులు అనిల్, శివ కృష్ణ, మణికుమారిపాల్గొన్నారు.

## సమిష్టిగా పనిచేస్తేనే సత్ఫలితాలు

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల



టీడీపీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న యనమల

తునిరూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):సమిష్టిగా పనిచేస్తేనే ఏ రంగంలోనైనా సత్ఫలితాలు వస్తాయని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు కీలక టీడీపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. అసం తృప్తికి తావు లేకుండా అందర్నీ సమన్వయపరచుకుని పార్టీ యంత్రాంగం అంతా సమిష్టిగా పనిచేయాలని యనమల కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల్లో నూరుశాతం ఫలితాలు సాధించే లక్ష్యంతో పనిచేయాలని ప్రభుత్వ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి పార్టీకి ప్రభుత్వానికి మధ్య వారధులుగా కార్యకర్తలు ఉండా లని యనమల అన్నారు. ఈ సమావేశంలో తుని తొండంగి కోటనందూరు మండలాల పార్టీ అధ్యక్షులు, తుని మున్సిపల్ చైర్ పర్సన్ నార్ల భువన సుందరి, టౌన్ టీడీపీ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి, మోతుకూరు వెంకటేష్, గాడి రాజబాబు, పెంటకోట భాస్కర్ సత్యనారాయణ ఉన్నారు.

## మెట్ట ప్రాంత రైతులకు మంచి రోజులు

● తాళ్లూరు లిఫ్ట్ మరమ్మతులకు ప్రభుత్వ ఆమోదం

గండేపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంత రైతులకు మంచి రోజులు వచ్చాయి. గత కొన్ని సంవత్సరాలుగా గండేపల్లి మండలంలో తాళ్లూరు గ్రామంలో ఉన్న పుష్కర లిఫ్ట్ ద్వారా సుమారు 32 వేల ఎకరాల రైతులకు సాగునీరు అందే పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదు సంవత్సరాలలో కూడా రైతులకు చుక్కనీరు కూడా అందలేదు. దీంతో పంటలు ఎండిపోవడంతో పాటు రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాగునీరు అందించాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా పెడచెవిన పెట్టారేతప్ప రైతుల ఆవేదనను అర్థం చేసుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతుల ఆవేదన అర్థం చేసుకుని తాళ్ళూరు పుష్కర లిఫ్ట్‌కి మరమ్మతులు చేసేందుకు క్యాబినెట్లో నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం..

## కోనేరులో కలుషిత నీటిని తొలగించాలని ధర్నా

రౌతులపూడి, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): బలరామపురంలో గ్రామశివారున కొనేరులో కలుషిత నీటిని తొలగించాలని ఎస్సీ కులస్తులు గురువారం మధ్యాహ్నం రహదారిపై ధర్నా నిర్వహించారు. కొనేరులో చేపలు మృతి చెందడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు, నీరు కలుషితమైంది. కొనేరుని ఆను కుని ఉన్న సరుగుడుతోటకు గడ్డి మందు కొట్టగా వర్షాలు రావడంతో కొనేరులో నీరు చేరడంతో చేపలు మృతి చెందినట్టు గ్రామస్థులు భావిస్తున్నారు. ఈ కొనేరును ఆనుకుని ఉన్న బావి నుంచి తాగునీటిని పట్టుకుంటారు. దీంతో నీటిని తొలగించాలని అధికారులను, గ్రామ నాయకులను కోరారు. దీంతో వారు పట్టించుకోకపోవడంతో కొనేరు సమీపంలో రహదారిపై టెంట్‌వేసి ఎస్సీ కులస్తులు ఆందోళనకు దిగారు. గతనాలుగు రోజులుగా తాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. రహదారిపై ట్రాఫిక్ సుమారు గం టసేపు నిలిచిపోయింది. విషయం తెలుకున్న పోలీస్‌లు, సొసైటీ అధ్యక్షుడు పైల పైడిరాజు, ఎంపీటీసీ సోమ రౌతు రవి, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు ఆందోళనకారులతో చర్చించారు. వెంటనే ఎక్స్‌కవేటర్‌తో కలుషిత నీటిని తొలగించడానికి చర్యలు తీసుకోవడంతో వారు ఆందోళన విరమించారు.

### సమస్యలపై అంగన్‌వాడీల నిరసన

వై.రామవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద బ్లాక్ డే నిర్వహించి నిరసన తెలిపారు. ప్రాజెక్ట్ అధ్యక్షురాలు బేబీరాణి ఆధ్వర్యంలో వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, డిమాండ్ చేశారు.

## రౌతుపాలెంలో అల్లూరి విగ్రహావిష్కరణ




రౌతుపాలెంలో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించిన బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సేవలు చిరస్మరణీయమని యువకులు ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. ప్రత్తిపాడు మండలం రౌతుపాలెం గ్రామంలో కూటమి నాయకులు తాతాజీ సహకారంతో ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని గురువారం ఘనంగా ఆవిష్కరిం చారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో రౌతుపాలెం సర్పంచ్ కొంగనకుమార్ స్వామి,ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ కుండల సాయికుమార్ యాదవ్ ,దాట్ల కృష్ణ వర్మ నిమ్మల రాంబాబు, లొండ లోవ రాజు, ఇంటి బాబురావు, ఇళ్ల అప్పారావు, గుండం సత్తిబాబు, కోలా ధనబాబు, సాన బోయిన కుశరాజు, చోడిశెట్టి రమేష్ బాబు,జిల్లా ఉపాధ్యక్షురాలు ఉషారాణి, జిల్లా కార్యదర్శి రెడ్డివరలక్ష్మి, నియోజవర్గం ఇన్‌చార్జ్ కందా వీరస్వామి, మండల ఉపాధ్యక్షుడు వీర నాగేశ్వరరావు, రెడ్డి లోవరాజు, ఏనుగు ధర్మరాజు, గరికి నాగు, చింతాకుల రామకృష్ణ, జువ్విన తిరుపతిరావు ఉన్నారు.

### గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలి : ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలో ముద్రగడ నివాసంలో మండల కన్వీనర్లతో పార్టీ కార్యక్రమాలపై సమావేశాన్ని నిర్వహించారు. ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు.

## ఫేస్ యాప్ రద్దు చేయాలని అంగన్‌వాడీల ధర్నా




ప్రత్తిపాడు, తొండంగిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రత్తిపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనకు నాయకత్వం వహించిన ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి అల్లాడి లక్ష్మి, సీఐటీయూ మమండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వా రా లబ్ధిదారులకు పోషకాహారాన్ని సకాలంలో అందించకుండా ఇబ్బందికరంగా ఉన్న పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌లు ఇవ్వడం కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తక్షణమే ఈ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు ల్యాబ్‌టాప్‌లు ఇచ్చి 5జీ నెట్‌వర్క్, ఇంటర్ నెట్‌సౌకర్యాలు కల్పించాలని ఆందోళనకారులు నినాదాలు చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు అందజేశారు.

### అంగన్వాడీ వర్కర్ల ధర్నా

తొండంగి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్లు గురువారం మండల రెవెన్యూ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. ఉద్యోగ భద్ర త కల్పించాలని, యాప్‌ల భారం తగ్గించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ కాంతారావుకు అందించారు. నేమా ల రాణి, మేరీ సమాధానం, కె. కామేశ్వరి, సుబ్బ లక్ష్మి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

### మధురానుభూతినిచ్చిన కాశీ యాత్ర

ప్రత్తిపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాశీ అయోధ్య మహాపాదయాత్ర మధురానుభూతినిచ్చిందని ఆయాత్రకు నాయకత్వం వహించి శ్రీరామనామక్షేత్రం అధ్యక్షుడు గళ్ళ సుబ్బారావు(రామకోటి సుబ్బారావు)చెప్పారు. కాశీ అయోధ్య మహాపాదయాత్ర నిర్వహించి మూడేళ్ల పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక నరేంద్రగిరి కొండ శ్రీరామనామ క్షేత్ర స్థూప ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న రామకోటి సుబ్బారావు మాట్లాడుతూ నరేంద్రగిరి శ్రీరామ నామ క్షేత్రం నుంచి మూడేళ్ళ కిందట కాశీ అయోధ్య మహాపాదయాత్ర 2వేల కిలోమీటర్లు నిర్వహించి విజయవంతంగా పూర్తి చేశామని గుర్తుచేశారు.ఈ పాదయాత్రలో పాల్గొన్న సభ్యులందరినీ ఆయన అభినందించారు. నాయకులు రెడ్డం రాజా, పుష్పారెడ్డి, మదినే నూకరాజు,పత్రి రమణ, లాయర్ బెహరా లక్ష్మీప్రసన్న, చినబాబు, అప్పలరాజు, కొండబాబు, రాంబాబు పాల్గొన్నారు.



### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం 11కేవీ నరేంద్రపట్నం ఫీడర్, 33కేవీ పెద్దాపురం-జగ్గంపేట ఫీడర్ నందు చెట్లు నరికివేత మరమ్మతులు కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఈఈ వీరభద్రరావు తెలిపారు. గొల్లలగుంట, కాట్రావులపల్లి, బావవరం, కాండ్రేగుల గ్రా మాలకు, బోరులకు, కాట్రావులపల్లి, సూరంపాలెం గ్రామాల బోరులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గండేపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఎన్టీ రాజాపురం, సింగరాయపాలెం, రామయంపాలెం, గండేపల్లి అలాగే బొర్రపాలెం పరిధిలో మల్లేపల్లి, బొర్రపాలెం, జెడ్.రాగంపేట, నీలాద్రిరావుపేట గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, ఏఈ కిరణ్ కిషోర్ తెలిపారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తునిరూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుం దని జగ్గంపేట ఈఈ వీరభద్రరావు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న విద్యుత్ నిర్మాణ పనుల కారణంగా కొలిమేరు, ఎన్.ఎస్.వెంకట్ నగరం, సురవరం, సుభద్రయ్యపేట, కోటయ్యపాలెం, అగ్రహారం, దొండవాక, మల్లవరం, బి.ఎస్.పేట, రాపాక, లోవకొత్తూరు, వేలంపేటల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

### 'విద్యార్థులకు ఉపాధి కల్పనే లక్ష్యం'

ఏలేశ్వరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉద్యోగాలతోపాటు స్వయం ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని కళాశాల ప్రిన్సిపాల్ సునీత అన్నారు. గురువారం కళాశాల ఆవరణలో విలేకరుల సమావేశంలో సునీత మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నేతృత్వంలో శుక్రవారం లారీ యూనియన్ వర్కర్స్ కార్యాలయంలో జాతీయ వర్క్‌షాప్‌ను పురష్కరించుకొని ప్రధానమంత్రి ఉచ్చతర శిక్షా అభియాన్ పథకంలో భాగంగా విద్యార్థుల కు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

### 'ఎమ్మెల్యే దగ్గుపాటిని సస్పెండ్ చేయాలి'

శంఖవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్‌ను వెంటనే టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని అభిమాన సంఘాల నాయకులు అమజాల వెంకటరమణ, బీఎస్. కిరణ్, కుక్కా శ్రీనులు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వాసంశెట్టి సూర్యఅర్జున్, ఏ.శ్రీను, పి.సురేష్, తాతాజీ, నాగు, రామకృష్ణ, శివ, రాజు పాల్గొన్నారు.

### 'అన్నదానాలు గ్రామ ఐకమత్యానికి దోహదం'

ప్రత్తిపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):అన్నదానాలు గ్రామ ఐక్యమత్యానికి దోహదపడతాయని ఒమ్మంగి సొసైటీ అధ్య క్షుడు, మాజీ ఎంపీపీ సత్యంశెట్టి సీతారాం చెప్పారు. మండలంలోని ఒమ్మంగి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కల్యాణోత్సవంలో భాగంగా గురువారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడితోపాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు. ఈ అన్నదానంలో 6వేలు పైబడి భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

### టీడీపీ నాయకుడు మణిబాబుకు సత్కారం



మణిబాబుని కలిసిన అంగన్‌వాడీ వర్కర్స్‌యూనియన్ సభ్యులు

జగ్గంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేవీఆర్ అపార్ట్‌మెంట్‌లో జగ్గంపేట మండల టీడీపీ అధ్యక్షుడు జీను మణిబాబుని జగ్గంపేట జ్యోతుల నెహ్రూ కాలనీలో టీడీపీ శ్రేణులు మర్యాదపూర్వంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా అభిమాన నాయకుడు జీను మణిబాబు మండల టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను మర్యాద పూ ర్వంగా కలిశామన్నారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కాలనీ ఏర్పాటుచేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని తరువాత కాలనీకి మళ్లీ ఆయనే సిమెంట్ రోడ్లు, మౌలిక వసతులు కల్పించాలని గుర్తు చేసుకున్నారు కార్యక్రమంలో ఈడిశెట్టి కొండబాబు, అప్పికొండ నాగేశ్వరరావు, బురా తాతాజీ, గేళ్ళ చిట్టిబాబు, దేవరకొండ రమణ, బల్ల అప్పారావు, లోడగల రాంబాబు, చల్లా నాగేశ్వరరావు, ఏపూరి చిలకమ్మా, గేళ్ళ వెంకయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

### కాకినాడ జిల్లా క్రీడాకారుల ప్రతిభ

తునిరూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి ఆట్యా పాట్యా జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ విభాగంలో కాకినాడజిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 9, 10 తేదీల్లో ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి ఆట్యా పాట్యా జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ పోటీల్లో అండర్ 17 పోటీల్లో సత్తా చాటినట్లు ఆట్యా పాట్యా అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.సత్యనారాయణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను రాష్ట్ర ప్రెసిడెంట్ కె.ఎస్.జాబేజ్, ఎంజేపీ ప్రిన్సిపాల్ పి.యజ్ఞ, జి.విక్టరీబాబు అభినందించారు.